ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 16 ఫిబ్రవరి 2025 | 5


కొమ్ము తలపాగాతో కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్
మార్చ్‌ఫాస్ట్

సివిల్ పవర్ చూపుతాం!

కలెక్టర్లు.. ఎస్పీలూ క్రీడా పోటీలు ఊహించగలమా.. కాస్త కష్టమే.. ఎందుకంటే జిల్లాకో కలెక్టర్.. ఎస్పీ ఉంటారు.. వీళ్ల మధ్య క్రీడాపోటీలు ఎలా జరుగుతాయని ఆశ్చర్యపోతున్నారా!? 2024 -25 సివిల్ సర్వీసెస్ ఆలిండియా పురుషులు.. మహిళల హాకీ టోర్నమెంట్ కాకినాడ జిల్లా క్రీడామైదానంలో శనివారం నుంచి ప్రారంభమైంది.. సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన క్రీడాకారులు 44 జట్లుగా ఏర్పడి తలపడుతున్నారు.. మన మధ్యకు వచ్చి ఈ నెల 28వ తేదీ వరకూ మేమూ ఆడతాం.. ప్రతిభ చాటుతాం అంటున్నారు.. - వివరాలు 6లో


ఆట..హాకీ..


క్రీడాజ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్, ఎస్పీ
మా ఆట చూపుతాం : క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్



మార్కెట్..చిక్కేనా!

సండే.. చికెన్ ఆశలు

వండుకు తింటే.. ప్రభావం ఉండదంటున్న వైద్యులు



ఆదివారం అంటేనే నాన్‌వెజ్ డే. మాంసాహార ప్రియులు ఎప్పుడొస్తుందా ఎదురుచూసే రోజు. ఆ రోజు ముక్కలేనిదే ముద్ద దిగదు.. చికెన్, మటన్, చేప, రొయ్యలకు డిమాండ్.. వీటిలో చికెన్ అంటే పెద్దలు, పిల్లలూ ఇష్టపడతారు. అందులోనూ చికెన్ బిర్యానీదే పైచేయి. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో ఈ ఆదివారం మాంసాహార ప్రియులు ఎలా స్పంది స్తారో ననే ఉత్కంఠ నెలకొంది. వారాంతపు రోజు కావడంతో ఈ ఒక్కరోజే వందలాది టన్నుల చికెన్ అమ్మకాలు, లక్షలాది గుడ్ల అమ్మకాలు సాగేవి. ప్రస్తుతం బర్డ్ ఫ్లూ ప్రభావంతో కొన్నిచోట్ల చికెన్ అమ్మకాలు పడిపోయాయి. హోటళ్లలోనూ ఆర్డర్లు పడిపోయాయి. ఈ నేపథ్యంలో నష్ట నివారణకు కోళ్ల పరిశ్రమ రంగంలోకి దిగింది. ప్రభుత్వం కూడా కొంత అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టింది. చికెన్ వండుకుని తినడం వల్ల ఎలాంటి హాని జరగదని వైద్యులు సైతం చెబుతున్నారు. కోడి గుడ్ల విషయంలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఆదివారం రానేవచ్చింది.. నేడు పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన పరిశ్రమ వర్గాల్లో నెలకొంది. సాధారణ పరిస్థితి ఏర్పడితేనే కోళ్ల పరిశ్రమ బయటపడే అవకాశం ఉంది.

అనపర్తి/మండపేట/ఉండ్రాజవరం/ అమలాపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ వచ్చిందని తెలియగానే చాలాచోట్ల చికెన్ దుకాణాలు మూతపడ్డాయి. బర్డ్‌ఫ్లూ సోకిన కోడిని సైతం వండుకుని తింటే మనుషులకు ఏమీ కాదని ఒకవైపు ప్రచారం జరుగుతున్నా ఇదిగో పులి అంటే అదిగో మేక అన్న చందంగా అసత్య ప్రచారాలతో కోడిమాంసం, గుడ్లు అమ్మకాలు పడిపోయాయి. దీంతో రైతులు కోళ్ల రేట్లను గణనీయంగా తగ్గించారు. మొన్నటి వరకు లైవ్ బాయిలర్ కిలో రూ.115 నుంచి 120 ఉండగా ప్రస్తుతం అది రూ.80 నుంచి రూ.90 వరకు ఉంది. ఫారం కోడి ధర లైవ్ రూ.90 పలుకగా ఇప్పుడు రూ.70కు ఇస్తున్నారు. ఇక గుడ్ల ధర విషయానికి వస్తే మొన్నటి వరకు పేపరు ధర రూ.4.90 ఉండగా నేడు రూ.4.55కు పడిపోయింది. కొన్ని చోట్ల ట్రేడర్లు మరింత దిగువకు కొనుగోలు చేస్తున్నారని పరిశ్రమ వర్గాలు ఒకటే గగ్గోలు పెడుతున్నాయి. మరోవైపు పౌల్ట్రీల వద్ద బర్డ్‌ఫ్లూ సోకకుండా తమ కోళ్లను రక్షించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్క కానూరు మినహా మిగిలినచోట్ల బర్డ్‌ఫ్లూ వ్యాపించిన ఘటనలు లేవు. అయినా మొత్తం మార్కెట్‌పై బర్డ్‌ఫ్లూ ప్రభావం చూపుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోనసీమలో గుడ్లు ఇవ్వండి!

కోనసీమ జిల్లాలో ఇప్పటి వరకూ ఎక్కడ ఒక్క బర్డ్‌ఫ్లూ కేసు నమోదు కాలేదు. జిల్లాలో 52 కమర్షియల్ పౌల్ట్రీ ఫార్మ్‌లో 32 లక్షల కోళ్లు, బ్యాక్యార్డ్ పౌల్ట్రీల్లో 24 లక్షల కోళ్లు ఉన్నాయి. వీటిలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపించలేదు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, హాస్టళ్లలో తిరిగి కోడిగుడ్లను బాగా ఉడికించి పిల్లలకు అందించండి. జిల్లాలో 10 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి కోళ్లు, కోళ్ల ఉత్పత్తులు జిల్లాలోకి రావడంపై ఆంక్షలు విధించాం. బర్డ్‌ఫ్లూ కేసులు లేనందున జిల్లాలోకి అనుమతించండి. మాంసం విక్రయదారులపై ఆంక్షలు విధించవద్దు.

- మహేష్‌కుమార్, కలెక్టర్

మటన్‌కు డిమాండ్.. కానీ..

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చికెన్‌ప్రియులను బర్డ్‌ఫ్లూ భయపెడుతుండడంతో గత కొద్దిరోజులుగా రాజమహేంద్రవరం సిటీలో చికెన్ అమ్మకాలు గణనీయంగా తగ్గిపోయాయి. సిటీలోనే ప్రధాన కోళ్ల మార్కెట్‌గా పేరొందిన జాంపేట కోళ్ల మార్కెట్ శనివారం దాదాపుగా బోసిపోయి కనిపించింది. ఇదిలా ఉంటే బర్డ్‌ఫ్లూ భయంతో చాలా హోటళ్లలో మెనూ మారిపోయింది. కర్రీ పాయింట్లలోనూ చికెన్‌కు ప్రాధాన్యం తగ్గింది. చికెన్ స్థానంలో కొత్తగా మటన్ వచ్చి చేరుతోంది. చాలామంది హోటల్ యజమానులు చికెన్ వెరైటీలను తగ్గించేసి మటన్ ప్రమోట్ చేస్తున్నారు. దీంతో మటన్ వ్యాపారులు ఒక్కసారిగా ధరలు పెంచేశారు. బర్డ్‌ఫ్లూ ముందు వరకూ కిలో రూ.800-రూ.880 ఉన్న కిలో మటన్ ధర ఇప్పుడు రూ.950కి చేరి సామాన్యులకు అందుబాటులో లేకపోయింది.



- బర్డ్‌ఫ్లూ దెబ్బకు మార్కెట్ కుదేలు
- చికెన్‌కు దూరమైన జనం
- తినేందుకు జంకుతున్న వైనం
- ఏమీ కాదంటున్న వైద్యులు
- అయినా మారని తీరు
- అసత్య ప్రచారాలతో నష్టాలు
- పడిన గుడ్ల వినియోగం
- రూ.4.50కు గుడ్డు ధర
- చికెన్ ధర తగ్గుముఖం
- యజమానుల లబోదిబో

కోట్లలో నష్టపోతున్నాం..

రాష్ట్రంలో కోడిగుడ్ల ఎగుమతులపై బర్డ్‌ఫ్లూ ప్రభావం పడడం వల్ల పౌల్ట్రీ పరిశ్రమకు తీవ్రంగా నష్టం జరుగుతోంది. దీనివల్ల రోజుకు రూ.2.5 కోట్లు నష్టపోతున్నాం. ఇక మాంసానికి విక్రయించే కోళ్ల నష్టం రోజుకు సుమారు రూ.కోటి వరకు ఉంటుంది. కోడిగుడ్లు, మాంసానికి విక్రయించే కోళ్ల వాహనాలను రాష్ట్ర సరిహద్దుల్లో నిలిపివేస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు ఎగుమతుల నిలుపుదలతో పాటు స్థానికంగానూ గుడ్ల వినియోగం గణనీయంగా తగ్గిపోయింది. అంగన్‌వాడీ కేంద్రాలకు, మధ్యాహ్న భోజన పథకానికీ గుడ్లను నిలిపివేశారు.

- కోమట్లపల్లి వెంకట సుబ్బారావు, పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు



సన్‌డే..ఆశలు

చికెన్ అమ్మకాలు గణనీయంగా పడిపోవడంతో మొన్నటి వరకు కిలో రూ.220 అమ్మిన స్కిన్‌లెస్ బాయిలర్ మాంసం ధర నేడు రూ.190కి పడింది. అయినప్పటికీ తగ్గకుండా ధర నిలబెట్టేందుకు పరిశ్రమ ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే వైద్యులు సైతం చికెన్, గుడ్లు పచ్చివి మాత్రమే తినకూడదని.. వండిన తర్వాత ఎలాంటి వైరస్ ఉండదని.. కాబట్టి తినొచ్చని చెబుతుండడంతో ఆదివారం మార్కెట్ తమను ఆదుకుంటుందనే ఆశతో కోళ్ల రైతులు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో నిత్యం 30 వేల బాయిలర్ కోళ్ల విక్రయాలు జరుగుతుంటాయి. ఆదివారం 50 వేలకుపైబడి బాయిలర్ కోళ్లను విక్రయిస్తారు. లేయర్ కోళ్ల విషయానికి వస్తే 25 వేల కోళ్ల విక్రయాలు సాగుతుండగా, ఆదివారం ఒక్కరోజే 40 వేల కోళ్లు విక్రయిస్తారు. ఈ ఆదివారం మార్కెట్ చిక్కాలని ఆశగా ఉన్నారు.



గుడ్డుకు.. బ్యాడ్ డేస్..

బర్డ్‌ఫ్లూ దెబ్బకు చికెన్ వినియోగంతోపాటు గుడ్ల విక్రయాలు గణనీయంగా తగ్గాయి. నిన్న మొన్నటి వరకు రూ.4.90 పలికిన గుడ్డు ధర ఇప్పుడు రూ.4.55కు పడిపోయింది. చిల్లర ధర మాత్రం నేటికీ రూ.6లు ఉన్నప్పటికీ వినియోగదారులు మొగ్గు చూపకపోవడంతో చిల్లర అమ్మకాలు నిలిచిపోయాయి.ఈ ప్రభా వం కేక్‌లపై కూడా పడింది. చాలామంది కేక్‌లు తినేందుకు ఇష్టపడడం లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గుడ్ల ఉత్పత్తి 1.30 కోట్ల మేర ఉండగా స్థానికంగా వినియోగం 30 శాతం ఉంటుంది. మిగిలిన 70 శాతం గుడ్లు పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, అస్సాం, మేఘాలయ తదితర రాష్ట్రాలకు ఎగుమతవుతాయి. ఈశాన్య రాష్ట్రాల్లో గుడ్ల ఉత్పత్తి తగ్గడంతో మన ఎగుమతులపై ఎలాంటి ప్రభావం పడలేదు. కానీ ట్రేడర్లు బర్డ్‌ఫ్లూ భూతం చూపి కొంత ధర తగ్గించినట్టు చెబుతున్నారు.

లెక్కతేలిన ఎమ్మెల్సీ ఓటర్లు

మొత్తం ఓటర్లు 3,14,984
అత్యధికం కాకినాడ జిల్లా.. ఓటర్లు 70,504
అత్యల్పం అల్లూరు జిల్లా .. ఓటర్లు 4,669
తూర్పుగోదావరి జిల్లా ఓటర్లు.. 62,970
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఓటర్లు.. 64,471 6



ఏమండోయ్.. మేమండి!

సోషల్ మీడియాలో దూసుకుపోతున్న దంపతులు
6 లక్షల మంది అభిమానం సొంతం
మొత్తం నాలుగు వేల వీడియోలతో ఓ రికార్డు
కడియపులంక నుంచి తెలుగువాళ్ల ప్రపంచంలోకి.. 6



శెహబాస్..ఆర్టీసీ డ్రైవర్స్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రతా నియమాలను వాహనదారులందరూ పాటించాలని జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ అన్నారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలో శనివారం సాయంత్రం రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా 23 మంది ప్రమాదరహిత డ్రైవర్లను సన్మానించారు. రోడ్డు భద్రతకు సంబంధించి నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో డీటీవో సురేష్, జిల్లా అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ, ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల అశోక, కొవ్వూరు,నిడదవోలు, రాజమహేంద్రవరం, గోకవరం డిపోల మేనేజర్లు, ఆయా ఆర్టీసీ డిపోల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘ నాయకులు

ఆప్కాస్ రద్దు వార్తలను ఖండిస్తున్నాం

జిల్లా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సుమన్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ నాయకులు డిమాండ్ చేశారు.రాజమహేంద్రవరంలో శనివారం జరిగిన ఆప్కాస్ ఉద్యోగుల జిల్లా స్థాయి సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కె.సుమన్, సహాధ్యక్షుడు గంట సంపత్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.గురునాథ్ మాట్లాడారు. ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేయాలని భావిస్తే ప్రత్యామ్నాయం చూపించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆప్కాస్‌ను రద్దు చేస్తున్నట్టు వస్తున్న ప్రకటనలను ఖండిస్తున్నామన్నారు.అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు నల్లమిల్లి ఆదిరెడ్డి, నాయకులు సుశీల, ఎస్.సుధాకర్, పి.లోవరాజు, ఎడ్ల బుజ్జిబాబు , సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ప్రాణం తీసిన.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

- రోడ్డుకు అడ్డంగా పైపులు
- కానరాని హెచ్చరిక బోర్డు
- బైక్‌తో ఢీకొట్టిన యువకుడు
- రాత్రి కనిపించకపోవడమే కారణం?


రోడ్డుకు అడ్డంగా ఉన్న పైపులను ఢీకొని మృతిచెందిన యువకుడు

రాజమహేంద్రవరంసిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ గుత్తేదారుడి నిర్లక్ష్యానికి శుక్రవారం రాత్రి ఒక యువకుడు బలయ్యాడు. రాజమహేంద్రవ రం వీవీ గార్డెన్స్‌కు చెందిన పాస్టర్ కన్నాన్ రాజు కుమారుడు కాకర్లపూడి విజయరూపస్ ఎంబీఏ చదువుకున్నాడు. పార్ట్ టైం జాబ్‌గా ఫ్లవర్ డెకరేషన్ చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఒక ఫంక్షన్‌కు ఫ్లవర్ డెకరేషన్ నిమిత్తం ఫ్లవర్స్ కొనుగోలు చేసేందుకు వీవీ గార్డెన్స్ నుంచి బైక్‌పై బయలు దేరాడు. గోరక్షణ పేట సెంటర్‌కు వచ్చేసరికి అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద రోడ్డుకు అడ్డంగా రెండు భారీ పైప్‌లు పెట్టిఉండడాన్ని గమనించలేకపోయాడు.నేరుగా పైప్‌లను బైక్‌తో ఢీకొట్టడంతో బైక్ హ్యాండిల్ తలకు ,వాతికి తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. కార్పొరేషన్ వేస్ట్ వాటర్ పైప్‌లైన్ వేసేందుకు రెండు భారీ పైప్‌లను తీసుకువచ్చిన గుత్తేదారుడు వాటిని రోడ్డుకు అడ్డంగా పెట్టి ఎటువంటి హెచ్చరిక బోర్డు పెట్టకుండా వదిలేశాడు. పైప్‌లు రెండు నలుపురంగులో ఉండడం వల్లన బైక్‌పై వచ్చిన రూపస్‌కు కనిపించలేదు. దీంతో వాటిని ఢీకొట్టి మృత్యువాతపడ్డాడు. సమాచారం అందుకున్న మృతుడి బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని ధర్నా చేశారు. కార్పొరేషన్ గుత్తేదారుడి నిర్లక్ష్యం కారణంగానే రూపస్ మృతి చెందాడని.. న్యాయం చేయాలని డిమాం డ్ చేశారు. సంఘటనా స్థలాన్ని వన్‌టౌన్ సీఐ మురళీకృష్ణ పరిశీలించి మృతదేహాన్ని పో స్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశా మని వన్‌టౌన్ సీఐ పేర్కొన్నారు. సీసీ కెమెరా ఫుటేజీ తదితర అంశాలు పరిశీలిస్తున్నా మన్నారు.ఎవరిదైనా నిర్లక్ష్యం ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశించారని చెప్పారు.



అమ్మా..బాగున్నారా!

ఎలా ఉన్నారమ్మా! అంతా బాగానే ఉందా.. ఏమైనా లోటుపాట్లు ఉన్నాయా అంటూ జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మీ శనివారం గౌతమి జీవ కారుణ్య సంఘ ఆవరణలోని వృద్ధాశ్రమంలో వృద్ధులను ప్రశ్నించారు. ఆశ్రమంలో శని వారం ఆమె పర్యటించి వసతులు, సదుపాయాలు, ఆహారం తదితర అంశాలపై ఆరా తీశారు. వృద్ధులతో మాట్లాడి యోగక్షేమాల గురించి తెలుసుకున్నారు. వేళకు భోజనం చేయాలని, మందులు వేసుకోవాలని సూచిం చారు. ఏదైనా ఇబ్బంది ఉంటే తమ దృష్టికి తీసుకురా వాలని సూచించారు. వృద్ధుల పట్ల బాధ్యత, ఆప్యా యత తో నడుచుకోవాలని వృద్ధాశ్రమ సిబ్బందిని ఆదేశించారు. - రాజమహేంద్రవరం



ఇంకుడు గుంతలు నిర్మించండి : కలెక్టర్

గోకవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. పరిశుభ్రతను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గోకవరం మండలం అచ్చుతాపురంలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులను శనివారం ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిశరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణానికి ఒక్కో దానికి రూ.6 వేలు చెల్లించడం జరుగుతుందన్నారు. ఇంకుడు గంతల నిర్మించుకోవడం ద్వారా గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడుతుందన్నారు. మండలానికి మంజూరైన 729 ఇంకుడు గుంతల నిర్మాణాలను పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోవిందు,తహ శీల్దార్ సాయిప్రసాద్,డ్వామా పీడీ ఎ.నాగ మహేశ్వరరావు,ఏపీవో అప్పలరాజు పాల్గొన్నారు.

వైద్యులు పనితీరుపై నిఘా : రమేష్‌కిశోర్
రాజమండ్రి ట్రాఫిక్ డీఎస్పీపై చర్యలు 7

ఏవండోయ్ మేమండి..



సోషల్ మీడియాలో దూసుకుపోతున్న దంపతులు
6 లక్షల మంది అభిమానం సొంతం



కుకింగ్ వీడియోలో..

కడియం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): 'ఏవండోయ్' అంటూ ఒకాయన తన జీవిత భాగస్వామితో కలిసి యూట్యూబ్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్‌లో చెప్పే ముచ్చట్లు, చూపించే వీడియోలకు లక్షలాది మంది ఫాలోవర్స్ ఫ్యాన్స్‌గా మారిపోయారు. తన భార్యను భుజానకెత్తుకుని తిరుపతి మెట్లు ఎక్కి ఫేమస్ అయిన రోజు నుంచే 'సోషల్ మీడియా'ను కూడా భుజానకెత్తుకుని సెలబ్రిటీలుగా మారిపోయారు..తూర్పుగోదావరి జిల్లా కడియపులంకకు చెందిన వరదా సత్యనారాయణమూర్తి (సత్తిబాబు)- లావణ్య దంపతుల ఏవండోయ్ అనే పలకరింపు ఫేమస్ అయ్యి లక్షలాది మంది అభిమానాన్ని మూటకట్టింది..



అభిమానుల ఆదరణ మరిచిపోలేం..

కడియపులంకలో లారీ ట్రాన్స్‌పోర్టు నిర్వహించేవారమని, సోషల్ మీడియా ద్వారా లభించిన ఆదరణ మర్చిపోలేమని సత్తిబాబు-లావణ్య దంపతులు తెలిపారు. కేవలం ప్రజలకు మంచి సందేశాత్మకమైన సమాచారాన్ని ఇవ్వాలనే ఉద్దేశంతో తాము చేస్తున్న వీడియోలకు వస్తున్న గుర్తింపు జీవితంలో మరువలేమని అన్నారు. తమను ఆదరిస్తున్న ప్రతీఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.



ఒకాయన మూడేళ్ల క్రితం తన భార్యను భుజానకెత్తుకుని తిరుమల మెట్లు ఎక్కారు. దీంతో ఒక్కరోజులోనే సోషల్ మీడియాలో స్టార్ అయిపోయారు. ఆ వీడియో చాలా రాష్ట్రాల్లో వైరల్‌గా మారింది. ఈ వీడియోతో ఆ భార్యాభర్తలు ఫేమస్ అయిపోయారు. సెలబ్రిటీలుగా మారిపోయారు. వారే తూర్పుగోదావరి జిల్లా కడియపులంకకు చెందిన వరదా సత్యనారాయణమూర్తి (సత్తిబాబు)- లావణ్య దంపతులు..'ఏవండోయ్' అంటూ వీళ్ల చెప్పే ముచ్చట్లు..చూపించే అందమైన పరిసరాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు అబ్బురపరుస్తాయి. మూడేళ్ల క్రితం వరకు వారు ఎవరికీ తెలియదు. అయితే కుటుంబ సభ్యులతో కలిసి కాలినడకన తిరుమల కొండ ఎక్కుతూ కొంత దూరం సత్తిబాబు భార్య లావణ్యను భుజాల మీద ఎత్తుకుని మెట్లు ఎక్కడంతో ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిపోయింది. అన్ని న్యూస్ ఛానళ్లలో అదే న్యూస్ అయిపోయింది. దీంతో వారు ఆ గుర్తింపును కొనసాగించాలనుకుని సోషల్ మీడియాలో అడుగుపెట్టారు.

6 లక్షల మంది ఫాలోవర్స్





'సత్తిబాబు కడియపులంక' పేరుతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఈ దంపతులకు సుమారు 6 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. దీంతో వారు ఎలాంటి మెసేజ్ ఇచ్చినా క్షణాల్లో తెలుగు రాష్ట్రాలతో పాటు ఏ ప్రాంతంలో ఉన్న తెలుగువారికైనా చేరిపోతుంది. రోజు రోజుకూ వీరి అభిమానుల సంఖ్య పెరుగుతూ వస్తోంది..

కడియం నర్సరీలో వీడియో..

నర్సరీలకు గుర్తింపు

కడియం నర్సరీ రంగానికి సంబంధించి వార్తా కథనాలు ఎప్పటికపుడు వెలువడుతూనే ఉంటాయి. అయితే ఈ దంపతులు ఈ నర్సరీల్లో ఉండే దేశ విదేశాలకు చెందిన మొక్కల ప్రత్యేకతలను వివరించడంతో మరింత ప్రాచుర్యం పొందాయి. ఏ నర్సరీలో ఎలాంటి ప్రత్యేకత మొక్క వచ్చినా ఈ దంపతులు వాటి వివరాలను క్షుణ్ణంగా ప్రజలకు చేరవేస్తున్నారు. అలంకరణ, పుష్పాలు, ఔషధాలు వంటి మొక్కల వివరాలు చెబుతూ వారు చేస్తున్న వీడియోలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

4 వేల వీడియోలు..

ఇప్పటి వరకు ఈ దంపతులు సుమారు 4 వేల వీడియోలను సోషల్ మీడియా ముందు ఉంచారు. నర్సరీ రంగంతో పాటు ఈ ప్రాంతంలో ఉండే ప్రముఖ దేవాలయాలు, మండువా లోగిళ్ల ఇళ్లు, సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన విషయాలు తెలియజేశారు. అలాగే ఆరోగ్య సూత్రాలు ప్రజలకు అందుబాటులో ఉన్న ఆస్పత్రుల వివరాలు, ప్రభుత్వం ఏర్పాటు చేసే కొన్ని సౌకర్యాలను లావణ్య-సత్తిబాబు దంపతులు వివరిస్తూ వస్తున్నారు.

లెక్కతేలిన ఎమ్మెల్సీ ఓటర్లు

● అత్యధికం కాకినాడ... అత్యల్పం అల్లూరు జిల్లా ● మొత్తం ఓటర్లు 3,14,984

ఏలూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : తూర్పు- పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల లెక్క తేలింది.ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు పోలిం గ్ జరగనున్న విషయం తెల్సిందే. ఓటర్ల చేర్పులకు ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ముగిసిన ఈ నెల 10వ తేదీ వరకు గడువు ఇవ్వగా, స్వల్పంగా హెచ్చు, తగ్గులు ఆయా జిల్లాల్లో చోటు చేసుకున్నాయి. ఓవరాల్‌గా లెక్క తేలారు. ఆరు జిల్లాల పరిధిలో మొత్తంగా 456 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 3,14,984 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పురుష ఓటర్లు 1,83,347 మంది ఉండగా, మహిళా ఓటర్లు 1,31,618 మంది ఉన్నారు. ట్రాన్స్‌జెండర్లు 19 మంది ఉన్నారు. ఓటర్లపరంగా కాకినాడ జిల్లాలో అత్యధికంగా 70,542 మంది ఉండగా, అత్యల్పంగా అల్లూరు సీతారామ రాజు జిల్లాలో 4,669 మంది ఓటర్లు ఉండటం గమనార్హం. ఈ సారి ఏలూరు జిల్లాలో వెయ్యి ఓట్ల కంటే ఎక్కువ మంది ఉన్నచోట్ల నాలుగు పోలింగ్ కేంద్రాలకు అదనంగా పెంచారు.

జిల్లాల వారీగా ఓటర్ల తుది జాబితా ఇలా..

వరుసనెం	జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	ట్రాన్‌జెండర్	మొత్తం
1	అల్లూరి	12	2,842	1827	0	4669
2	కోనసీమ	95	37,114	27,355	2	64,471
3	తూర్పు	92	36,361	26,606	3	62,970
4	ఏలూరు	66	24,704	17,571	7	42,282
5	కాకినాడ	98	42,463	28,072	5	70,504
6	పశ్చిమ	93	38,863	30,187	2	70,052
	మొత్తం - 456		1,83,347	1,31,618	19	3,14,984

పట్టభద్రులూ ఓటెయ్యడానికి ఈ అర్హతాపత్రాలు చూసుకోండి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి ఓటు లిస్టులో ఉంటే సరిపోదు. దీనికి సంబంధించి అర్హతా పత్రంను గ్రాడ్యుయేట్ కలిగి ఉండాలి.అవి ఇవే... ఓటరు ఐడీ కార్డు, పాన్ కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, డిగ్రీ అర్హతా సర్టిఫికెట్లు, ప్రవేట్ సంస్థల్లో పనిచేసే వారి హోదాతో జారీ చేసే కార్డులు సరిపోతాయి. బీఎల్‌వోలు ఇంటింటా వచ్చి ఓటరు స్లిప్పులిచ్చి సమాచారం తెలియజేస్తారు. అయితే ఈ స్లిప్‌లు కేవలం ఎంట్రీకి ఉపయోగపడతాయి. ఓటరు తన అర్హతా పత్రాల్లో ఏదో ఒకటి తప్పనిసరిగా తీసుకెళ్ళాలి. ఇందులో ప్రాధమిక సమాచారం ఖచ్చితత్వంతో ఉండాలి.

ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం

● రిటర్నింగ్ ఆఫీసర్ వెట్రిసెల్వి

ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యానికి అవకాశం కల్పించినట్లు తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి తెలిపారు. ఈ నెల 27న జరిగే ఎన్నికల నిమిత్తం విధుల్లో పాల్గొనే సిబ్బంది వారి ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవచ్చని అన్నారు. దీనికి ఫారం - 12ను జిల్లా రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కేంద్రానికి ఈనెల 20వ తేదీ సాయం త్రం ఐదు గంటల్లోగా సిబ్బంది సమర్పిం చాలన్నారు. సిబ్బంది ఫారం-12ను ఏలూరు. ఏపీ.జీవో.ఇన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ ఫారంతో పాటు డ్యూటీ కేటాయింపు చేసిన ఉత్తర్వులు జిరాక్స్‌లు జతపర్చాలని ఆమె కోరారు.

సత్యదేవుడి సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

అన్నవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శనివారం రాత్రి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. వేదపండితులు వేదాశీర్వచనాలు అందించారు.



స్వామివారి దర్శనార్థం ఆలయంలోకి వస్తున్న న్యాయమూర్తి మహేశ్వరి

క్రీడా సంరంభం



గౌరవ వందనం సమర్పిస్తున్న క్రీడాకారులు



వేదికపై మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

» అట్టహాసంగా ప్రారంభమైన ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నీ
» వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన 44 జట్లు
» తొలిరోజు అంబరాన్నంటిన సంబరాలు
» పతకాలతో క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్
» క్రీడా జ్యోతిని వెలిగించి టోర్నీని ప్రారంభించిన కాకినాడ కలెక్టర్
» వెయ్యిమంది క్రీడాకారులతో కిక్కిరిసిన జిల్లా క్రీడా ప్రాంగణం
» కొమ్ము డ్యాన్సులో పాల్గొన్న జిల్లా అధికారి షాన్‌మోహన్
» అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కలెక్టరేట్(కాకినాడ)/సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానంలో ఆస్ట్రో టర్ఫ్ ఫీల్డ్ వేదికగా 2024-25 ఆలిండియా సివిల్ సర్వీసెస్ పురుషుల, మహిళల హాకీ టోర్నమెంట్ శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. దేశంలోని 18 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 44 జట్లు పాల్గొన్నాయి. క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నడుమ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దీనికి ముఖ్యఅతిథులుగా కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్ విచ్చేయగా కలెక్టర్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్నట్టు ప్రకటించి బెలూన్లు ఎగరవేశారు. క్రీడా జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిష్మాత్మకమైన ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇచ్చే అవకాశం కల్పించినందుకు సివిల్ సర్వీసెస్ స్పోర్ట్స్ బోర్డుకు ధన్యవాదాలు తెలిపారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద కాకినాడ జిల్లా క్రీడా మైదానాన్ని జాతీయ స్థాయి టోర్నమెంట్లు నిర్వహించే విధంగా అత్యుత్తమంగా అభివృద్ధి చేశామన్నారు. టోర్నీకి విచ్చేసిన క్రీడాకారులందరికీ స్వాగతం పలుకుతూ క్రీడా స్ఫూర్తితో ఈవెంట్‌ను విజయవంతం చేయాలన్నారు. క్రీడాకారులు తమ జిల్లాలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాలు, బీచ్‌ను సందర్శించాలని సూచించారు. టోర్నమెంట్ నిర్వహణకు స్పాన్సర్ చేసిన కార్పొరేట్, వ్యాపార, పారిశ్రామిక సంస్థలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మరో ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి పెద్దఎత్తున క్రీడాకారులు విచ్చేసి ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించి టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసికోల్లాసాన్ని ఇస్తాయన్నారు.

తొలిరోజు విజేతలు

కాకినాడ జిల్లా క్రీడామైదానంలో శనివారం జరిగిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్-2025లో మ్యాచ్-1లో హరియాణా జట్టు 14-0 తేడాతో హిమాచల్‌ప్రదేశ్ జట్టుపై గెలుపొందగా మ్యాచ్-2లో పాండిచ్చేరి జట్టు 10-1 తేడాతో కర్ణాటక జట్టుపై విజయం సాధించింది.

అతిథులకు సత్కారం

టోర్నమెంట్‌కు అతిథులుగా విచ్చేసిన అర్జున అవార్డు గ్రహీతలు మహ్మద్ రియాజ్, ముకేష్ కుమార్‌లను కలెక్టర్ సత్కరించారు. ఇటీవల జాతీయ క్రీడల్లో జిమ్నాస్టిక్స్‌లో బంగారుపతకం సాధించిన కాకినాడ జిల్లా క్రీడాకారిణి ఎస్కే యాసిన్‌ను, కోచ్ సురేష్‌లను సన్మానించారు. కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్ రవిచంద్ర స్పాన్సర్ చేసిన రూ.25వేలు చెక్కును యాసిన్‌కు అందజేశారు. అనంతరం స్పాన్సర్‌లైన కాకినాడ సీపోర్టు లిమిటెడ్, ఓఎన్‌జీసీ, అపోలో ఆసుపత్రి, నెక్కంటి సీఫుడ్స్, పట్టాభి ఇండస్ట్రీస్, లలితా ఇండస్ట్రీస్, శ్రీసత్య స్కాన్, ఆదిత్య యూనివర్శిటీ, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్, టైకీ ఇండస్ట్రీస్ ప్రతినిధులను ఘనంగా సత్కరించారు.



కళాకారుడి ప్రదర్శన



పాట పాడుతున్న కళాకారుడు



కర్రసాము ప్రదర్శిస్తున్న కళాకారులు

ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళి

తొలుత ముఖ్యఅతిథులు, అతిథులు, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తదుపరి జాతీయ జెండాను జేసీ రాహుల్‌మీనా, ఆలిండియా హాకీ టోర్నమెంట్ జెండాను అసిస్టెంట్ కలెక్టర్ భావన, రాష్ట్ర జెండాను డీఆర్వో వెంకట్రావు ఆవిష్కరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పోటీల అనంతరం క్రీడా మైదానంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. చింతూరు గిరిజన కళాకారులు నిర్వహించిన సాంప్రదాయ నృత్యం కొమ్ము డ్యాన్సులో కలెక్టర్, ఎస్పీ పాల్గొని కొమ్మును ధరించారు. వైజాగ్ బల్దేవ్ మార్షల్ ఆర్ట్స్ సంస్థల విద్యార్థులు నిర్వహించిన కర్రసాము ఆకట్టుకుంది. కళాంజలి ఆర్కెస్ట్రా నిర్వహించిన రాక్ బ్యాండ్ ఉర్రూతలూగించింది. విశాఖపట్నానికి చెందిన కోచ్ బాల్‌దేవ్ ఆధ్వర్యంలో 23 మంది ప్రదర్శించిన కర్రసాము అందరినీ ఆకట్టుకుంది.

నిర్వహణకు రూ.2 కోట్లు

రెండు వారాలపాటు నిర్వహించే ఈ టోర్నమెంట్ నిర్వహణకు సుమారు రూ.2 కోట్లు కేటాయించినట్టు అధికారులు తెలిపారు. కొంత ప్రభుత్వం సమకూర్చగా, మిగిలిన నిధులు వివిధ పారిశ్రామికవేత్తలు, అసోసియేషన్లు సమకూర్చినట్లు అధికారులు వెల్లడించారు. ప్రతిరోజు దాదాపు వెయ్యిమంది క్రీడాకారులకు టీ, టిఫెన్, భోజనాలు అందించేందుకు జిల్లా క్రీడామైదానంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

తలపడే జట్లు ఇవే..

రెండు వారాలపాటు నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో బీహార్, చండీఘర్, చత్తీస్‌ఘడ్, న్యూఢిల్లీ, రాయ్‌పూర్, ఢిల్లీ సెంట్రల్ సెక్రటేరియేట్, గుజరాత్ సెక్రటేరియట్, ఆర్ఎస్‌బీ అహ్మదాబాద్, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, సిమ్లా, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిసా, పాండిచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ నుంచి టీమ్‌లు తలపడనున్నాయి.



కొమ్ము ధరించిన ఎస్పీ బిందు మాధవ్



హాకీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

అంతర్జాతీయ క్రీడాకారుల రాకతో ప్రేరణ



ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నీ ఏపీలో తొలిసారిగా ఆతిథ్య ఇవ్వడం ఆనందంగా ఉంది. అంతర్జాతీయ క్రీడాకారుల రాకతో విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి, ప్రేరణ కలిగించినట్టు అవుతుంది. నిత్యం ఉద్యోగాల్లో బిజీగా ఉండే అధికారులు, సిబ్బందికి ఇటువంటి టోర్నీలు మానసిక ఉత్తేజాన్ని ఇస్తాయి. ఆలిండియా స్థాయిలో వివిధ రాష్ట్రాల్లో ఏజీఎస్, ఇన్‌కంటాక్స్ తదితర శాఖల భాగస్వామ్యంతో హాకీ టోర్నీమెంట్లు జరిగేవి. తొలిసారిగా ఏపీలో జరుగుతోన్న టోర్నీలో ప్రభుత్వ భాగస్వామ్యంగా ఉండడం క్రీడలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రాధాన్యతను తెలియజేస్తోంది. కాకినాడలో 4-5 ఏళ్ల కిందట ఒకసారి మహిళల టోర్నీకి వచ్చాను. కాకినాడ కాజా నచ్చింది.

-ముకేష్ కుమార్, అర్జున అవార్డు గ్రహీత.

క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహించాలి

క్రీడల పట్ల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల్లో ఆసక్తి పెరుగుతోంది. ప్రభుత్వం మరింత ప్రోత్సహిస్తే ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తారు. నాణ్యమైన తరీదునిచ్చే కోచ్‌లను నియమించాలి. టోర్నమెంట్స్ నిర్వహించడం వల్ల నిత్యం విధినిర్వహణలో బిజీగా ఉండే ఉద్యోగులకు మానసిక ఉల్లాసం కలుగుతుంది. నేను 1996, 2000లో వేసవి ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించాను. 1998లో భారత ప్రభుత్వం ప్రతిష్మాత్మక అర్జున అవార్డును బహూకరించింది. ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ కాకినాడలో నిర్వహించడంతో భవిష్యత్తులో హాకీ పట్ల విద్యార్థులు, యువతకు మరింత మక్కువ కలుగుతుంది. ఇక్కడి క్రీడా మైదానంలో సౌకర్యాలు అంతర్జాతీయ క్రీడా మైదానానికి దీటుగా ఉన్నాయి.

-మహమ్మద్ రియాజ్, అర్జున అవార్డు గ్రహీత.

హైదరాబాద్ నుంచి వచ్చి పురుగుమందు తాగి..

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కపిలేశ్వపురానికి చెందిన ఇ.నాగలక్ష్మీ దుర్గ(28) తన భర్త ముగ్గురు పిల్లలతో కలిసి తెలంగాణలోని శంషాబాద్‌లో నివాసం ఉంటున్నారు. అయితే స్త్రీ సంబంధిత ఆరోగ్య సమ్యలవల్ల ఆమె బాధపడుతూ ఈ నెల 1న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయ్నానికి పాల్పడింది. రాజమహేంద్రవరంలోని తెలిసిన వ్యక్తి సూచనతో వైద్యానికి ఇక్కడికి వచ్చారు. హైవేలోని బొమ్మూరు పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. దీనిపై ప్రకాశం నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో
లారీ డ్రైవర్ మృతి

● మృతుడు పంగిడివాసిగా గుర్తింపు



మృతిచెందిన లారీ డ్రైవర్ రామకృష్ణ

మండపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) అంబేడ్కర్ కోనసీమజిల్లా మండపేట మండలం ద్వారపూడి పంచాయతీపరిధిలో గల వేములపల్లిలో విద్యుదాఘాతానికిగురై లారీ డ్రైవర్ శనివారం అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. మండపేట రూరల్ సీఐ పీతల దొరరాజు తెలిపిన వివరాల ప్రకారం తూర్పుగోదావరిజిల్లా కొవ్వూరు మండలం పంగిడికి చెందిన చిటికెన రామకృష్ణ(52)లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడు వేములపల్లిలో వున్న బ్రాన్ ఆయిల్ ఫ్యాక్టరీలో ఆయిల్‌లోడ్‌ను తీసు కువెళ్లేందుకు వచ్చి శనివారం ట్యాంకర్‌ను ఫ్యాక్టరీ బయట ఉంచి శుభ్రం చేసుకునేందుకు లారీపైకి ఎక్కిన డ్రైవర్ రామకృష్ణకు సమీపంలో ఉన్న 33, 11కె.వి. విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురికావటంతో లారీ పైనుంచి కింద పడిపోయి అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మండపేట రూరల్ సీ.ఐ. దొరరాజు, ఎస్ఐ బుజ్జిబాబు లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సంఘటనపై మృతుడి కుమారుడు చిటికెన శ్రీరామచంద్రుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీ.ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రైలు ఎక్కుతూ జారిపడి యువకుడి మృతి



వాకాడ జాన్‌బాబు

సామర్లకోట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి):కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్‌లో సామర్లకోట నుంచి నూజివీడు వెళ్లేందుకు తన తండ్రి, భార్య, కుమారుడితో వెళ్లేందుకు శనివారం రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తూ కిందికి జారిపడడం, అదే సమయంలో రైలు బయలుదేరడంతో ఆ రైలు కింద పడి తీవ్రగాయాలతో కొత్తపల్లి మండలం ఉప్పాడ నాయకర్ కాలనీకు చెందిన వాకాడ జాన్‌బాబు (27) అక్కడికక్కడే మృతి చెందాడు. చెంతనే ఉన్న జాన్‌బాబు కుటుంబ సభ్యులు నిశ్చే ష్టులై రోదించారు. సామర్లకోట రైల్వే పోలీ సులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సామర్లకోట రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి, ఆలయం తిరువీధులలో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

గోవిందనామస్మరణతో మార్మోగిన వాడపల్లి

● స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.41.92లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల లో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.41.92 లక్షలు లభించినట్టు ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

భీమేశ్వరాలయంలో శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన



భీమేశ్వరాలయంలో శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లు చర్చిస్తున్న అధికారులు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన పంచారామ క్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను శనివారం దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమి షనర్, ఉపకమిషనర్, జిల్లా దేవదాయశాఖ అధికారితో కలసి పరిశీలించారు. ఆలయంలో ముందు గా దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషన ర్ కె.సుబ్బారావు, ఉపకమీషనర్, శివరాత్రి ఉత్సవ అధికారి డి.ఎల్.వి.రమేష్‌బాబు, జిల్లా దేవదాయశాఖ అధికారి వి.సత్యనారాయణ భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ఏర్పాట్లు క్షుణ్ణంగా పరిశీలించారు. భక్తుల దర్శనానికి క్యూలైన్లు, బారీకేడ్లు ఏర్పాటు, సప్తగోదావరిలో పుణ్యస్నానాలు, అభిషేకాలు నిర్వహణ ఇతర భద్రతా ఏర్పాట్లుపై చర్చించి ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవానీకి పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఉపకార్యనిర్వాహక ఇంజనీరు శ్రీనివాస్, తనిఖీదారు బాలాజీ రామ్‌ప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాదగయలో హుండీల ఆదాయం లెక్కింపు

● రూ.11.61లక్షల ఆదాయం

పిఠాపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో హుండీలను శనివారం తెరిచారు. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయ స్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహుతికాఅమ్మవార్ల సన్నిధిలో ఉన్న హుండీలను తెరిచి లెక్కించగా రూ. 11,61,650 ఆదాయం లభించింది. లెక్కింపులో దేవదాయశాఖ తనిఖీదారు వడ్డి ఫణీంద్ర కుమార్, ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, బ్యాంకు, ఆలయ సిబ్బం ది పాల్గొన్నారు.



పిఠాపురం పాదగయ క్షేత్రంలో హుండీలలోని ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

వైద్యుల పనితీరుపై నిఘా

డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ రమేష్‌కిశోర్



కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ రమేష్‌కిషోర్

కొవ్వూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించడానికి వైద్యుల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ డాక్టర్ టి.రమేష్‌కిశోర్ అన్నారు. కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి, డీహెచ్ఎస్ కార్యాలయాన్ని శనివారం తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకుని మాట్లాడారు. ఇటీవల ప్రజల్లో సదరం సర్టిఫికెట్లు తొలగిస్తున్నామని అపోహలు ఉన్నాయన్నారు. దీనివల్ల అర్హులకు ఇబ్బంది ఉండదన్నారు. ఫేక్ సర్టిఫికెట్లు పెట్టిన వారిని ఏరివేస్తామన్నారు. మరో వారంలో సర్వే పూర్తవుతుందన్నారు. తాడేపల్లిలోని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా డాక్టర్‌ల పనితీరును పరిశీలిస్తామన్నారు. రాత్రి డ్యూటీలో డాక్టర్లపై ప్రత్యేకనిఘా పెట్టామన్నారు. దీనిలోభాగంగా గతనెల రోజుల్లో 50 మంది వైద్యులకు పనితీరు మార్చుకోవాలని షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. ఫిబ్రవరి మొదటివారం నుంచి ఓపీ కౌంటర్లు, ఆపరేషన్ థియేటర్లు, పేషెంట్లు ఉండే వార్డుల్లో క్యూఆర్ కోడ్ పెట్టామన్నారు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే 6 ప్రశ్నలు వస్తాయి. వీటి ద్వారా ఆసుపత్రిలో వైద్యుల పనితీరు, మందుల కొరత, లాబ్ టెస్టులు, నర్సుల ప్రవర్తన తదితర వివరాలు రోగుల నుంచి తెలుసుకుంటామన్నారు.స్పెషలిస్టు డాక్టర్ల రిక్రూట్‌మెంట్ జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 297 డాక్టర్ పోస్టులకు 2600 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ఉండడంతో ఆలస్యమైందన్నారు. మార్చి నెలాఖరు నాటికి స్పెషలిస్టు డాక్టర్ల భర్తీ జరుగుతుందన్నారు. పదోన్నతులు ఇస్తామన్నారు. ప్రతిరోజు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు సంబంధించిన అబా ఐడి క్రియేట్ చేస్తే కేంద్ర ప్రభుత్వం ప్రతి పేషెంటుకు రూ20లు ఆసుపత్రి ఖాతాకు జమ చేస్తుందన్నారు. గత రెండు నెలలుగా పేషెంటు ఈహెచ్‌ఆర్‌లు స్కాన్ చేసి అబా ఐడి క్రియేట్ చేయడంలో తుని ఆసుపత్రికి సుమారు రూ.2లక్షల వరకు సొమ్ము జమైందన్నారు. అబా ఐడి క్రియేట్ చేయడానికి స్థానికంగా ఇద్దరు వ్యక్తులను రూ.8 వేలు గౌరవ వేతనం ఇచ్చి ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. ఇలా వచ్చిన సొమ్ముతో ఆసుపత్రికి అవసరమైన వస్తువులు కొనుగోలు చేసుకోవచ్చునన్నారు. 26 జిల్లాల డీసీహెచ్ఎస్‌లకు హైర్ వాహనాలు తీసుకోవడానికి అనుమతులిచ్చామన్నారు. పారిశుధ్యం, సెక్యూరిటీలకు సంబంధించి సమస్య పరిష్కారానికి న్యూ టెండర్లకు వెళ్లామన్నారు. అత్యవసర మందుల కొరత ఉంటే గుర్తించి ఆరోగ్యశ్రీ నిధులు, హెడీఎస్‌లో నిధులు ఉపయోగించి ఆసుపత్రి సూపరింటెండెంట్లు కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎన్.పద్మశ్రీరాణి, ఏడీ టి.విజయలక్ష్మి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.సాయికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

టార్క్-2025 టెక్నికల్ సింపోజియం

» మార్చి 15, 16 తేదీల్లో జాతీయస్థాయిలో నిర్వహణ

» పోస్టర్‌ను ఆవిష్కరించిన వీసీ మురళీకృష్ణ



టార్క్ టెక్నికల్ సింపోజియం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని సమావేశహాల్లో యూసీఈకే మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం, స్టూడెంట్ చాప్టర్ల సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 15, 16 తేదీల్లో నిర్వహించనున్న టార్క్-2025 టెక్నికల్ సింపోజియం పోస్టర్‌ను వర్సిటీ ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ శనివారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ సింపోజియంలో భాగంగా బ్రిడ్జ్ బిల్డింగ్, లేత్ మాస్టర్, వర్క్‌షాప్స్, రోబోరేస్, డిజైన్ ఫ్రీక్, చెస్ మోనార్క్, మెకానికల్ క్విజ్, మెక్ ఓమేనియా, స్లైడ్‌ప్లెయి న్, ప్రాజెక్టు ఎక్స్‌పో, కాస్టింగ్ క్రౌన్, ఇంజన్ మాంటేజ్ వివిధ పోటీలు నిర్వహించనున్నారన్నారు. అంతేకాకుండా దీని ద్వారా విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, టీమ్‌వర్క్, సాంకేతిక అంశాలపై పట్టు సాధించడం, ప్రజంటేషన్ స్కిల్స్ పెంపొందుతాయన్నారు. అనంతరం సింపోజియం కన్వీనర్ డాక్టర్ డి.లింగరాజు మాట్లాడుతూ వర్సిటీ, అనుబంధ కళాశాలకు చెందిన విద్యార్థులు ఈఫెస్ట్‌లో పాల్గొని నూతన ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, వినూత్న ప్రదర్శనలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ సమన్వయకర్తలు పాల్గొన్నారు.

మన్యం కొండ జాతర ఏర్పాట్ల పరిశీలన



సీలేరునదిలో ప్లోటింగ్ బ్రిడ్జిప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఇరు రాష్ట్రాల అధికారులు

మోతుగూడెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చిం తూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు గ్రామంలో సీలేరు నది ఒడ్డున ఒడిస్సా రాష్ట్రం మల్కన్‌గిరి ఐటీడీఏ పీవో దుర్యోధన్ బయర్, చింతూరు తహసీల్దార్ చిరంజీవి సందర్శించారు. అనంతరం ఒడిశా మన్యం కొండ జాతర కమిటీ సభ్యులతో చర్చించారు. అవతల ఒడ్డు నుంచి ఇవ తల ఒడ్డుకు నీటిలో పడవపై ప్రయాణించే భక్తుల కు తగు జాగ్రత్తలు, జలపాతంవద్ద జాతర జరిగే ప్రదేశాన్ని పరిశీలించారు. అక్కడ భారీ కేడ్‌లు ఏర్పాటుచేయాలని పార్కింగ్ స్థలం కూడా దూరం గా ఉంచాలని ఇరురాష్ట్రాల అధికారులకు సూచించా రు. పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని మోతుగూడెం పంచాయతీ కార్యదర్శి జి.మోహన్‌కి సూచించారు. అక్కడి నుంచి ఇరురాష్ట్రాల అధికారులు సీలేరు నదిపై ఏర్పాటుచేసే ఫ్లోటింగ్ బ్రిడ్జి ఏర్పాట్లు చేసే ప్రదేశాన్ని స్వయంగా బోటుపై వెళ్లి పరిశీలించారు. అక్కడి సమస్యలు గురించి లక్కవరం ఫారెస్ట్ రేంజర్ నానాజీని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి, చింతూరు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌ను ఢీకొట్టిన ఏడుగురిపై కేసు నమోదు

కొవ్వూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : దొంగతనాలకు పాల్పడి పారిపోతూ కానిస్టేబుల్‌ను స్కార్పియోతో ఢీకొట్టి గాయపర్చిన ఏడుగురు వ్యక్తులపై కేసునమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. యర్రవరం గ్రామంలో దొంగతనం చేసి స్కార్పియో వాహనంలో విజయవాడవైపు పారిపోతున్నారని సమాచారం రావడంతో పోలీసులు కొవ్వూరు గా మన్‌బ్రిడ్జి టోల్‌ప్లాజా సమీపంలో ఎన్‌హెచ్ 16 వద్ద విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ బి.రాంబాబు, హెచ్‌సీ ఎం.లక్ష్మీనారాయణలకు సమాచారం అందించారు. దీంతో టోల్ గేట్ వద్ద వాహనాలను తనిఖీ చేపట్టారు. వాహనాన్ని ఆపడానికి ప్రయత్నించగా ఢీకొట్టడంతో రాంబాబు కింద పడిపోయాడు. గాయాలు కావడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దీంతో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు.

ట్రాఫిక్ డీఎస్పీపై చర్యలు

● చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్‌కి ఉత్తర్వులు



డీఎస్పీ మేడిశెట్టి వెంకటేశ్వర్లు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ డీఎస్పీ మేడిశెట్టి వెంకటేశ్వర్లుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. రాజమహేంద్రవరం వచ్చిన నాటి నుంచీ ఆరోపణలు మూటగట్టుకున్న ఆయనకు జిల్లానుంచి ఉద్వాసన పలికారు. గతేడాది డిసెంబరు 24న దేవీచౌక్‌లోని స్వాతీ టీస్టాల్‌లో పని చేస్తున్న యువకుడిని ఆయన కొట్టుకుంటూ జీపులో ఎక్కించుకెళ్లారు. దీనికి సంబంధించిన సీసీ కెమెరా ఫుటేజీలు ఇటీవల బయటికి వచ్చాయి. సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఒక వ్యక్తిపై పోలీసు దాష్టీకాన్ని జనం ఖండించారు. ఈ విషయం ఎస్పీ నరసింహకిషోర్ దృష్టికి చేరింది. అమానవీయ ప్రవర్తనపై ఉక్కుపాదం మోపే ఎస్పీ. సదరు డీఎస్పీపై అంతర్గత విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. దీంతో ఆయనను తక్షణమే ఇక్కడి విధుల నుంచి తప్పిస్తూ డీజీపీ కార్యాలయంలోని ఏడీజీపీ(శాంతి భద్రతలు) వద్ద రిపోర్టు చేయాల్సిందిగా రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి శనివారం ఆదేశాలు వెలువడ్డాయి. ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఆయనను వెంటనే రిలీవ్ చేయాల్సిందిగా ఎస్పీని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. కాగా.. కొద్దిరోజుల క్రితం డీఎస్పీ వెంకటేశ్వర్లు గుణదల ఉత్సవాలకు బందోబస్తుకు వెళ్లారు. ఆయనపై చర్యలు తప్పవనే ఉద్దేశంతో అక్కడి విధుల అనంతరం విజయవాడలో బందోబస్తుకు పంపించేశారని అంటున్నారు. గతంలో ఆ డీఎస్పీ ఓ మహిళా కానిస్టేబుల్‌ని లైంగికంగా వేధించడంపై అప్పట్లోనే ఎస్పీ సీరియస్ అయ్యారు. ఆ ఘటనలో ఇంకెప్పుడూ ఆమె జోలికి వెళ్లనంటూ డీఎస్పీ వెంకటేశ్వర్లు స్టాంపు పేపర్‌పై రాసిచ్చారు. ఇది పోలీసు అధికారులకు తప్పుడు మెస్సేజ్ పంపిస్తుందంటూ విమర్శలు వెల్లువెత్తాయి. అప్పట్లోనే ఆ డీఎస్పీపై సస్పెన్షన్ వేటు పడాల్సి ఉండగా 'మేనేజ్' చేసుకున్నారనే విమర్శలు వినిపించాయి. అప్పటి నుంచీ ఆయనను స్థాని క విధులకు దూరం పెడుతూ వచ్చారు. తర్వాత తన వద్ద పనిచేసే హోంగార్డును ఇష్టాను సారం తిట్టడంతో అతడు ఆత్మహత్య చేసుకుంటా నంటూ ఆవేదన చెందారు. ఇలా తరచూ డీఎస్పీపై ఆరోపణ లు వస్తుండడంతో కీలకమైన విధులకు దూరంగా ఉంచారు. అయితే, ఓ సాధారణ యువకుడిని పబ్లిక్‌లో కొట్టుకుంటూ తీసుకెళ్లడంతో ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేశారని తెలుస్తోంది. ఆయన సిఫారసుతో ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమిం చారు. కాగా నాణేనికి మరోవైపు ఇంకొక విధంగా గుసగుసలు వినవస్తున్నాయి. రాజమహేంద్రవరం డీఎస్పీగా రావడానికి అంబికా ప్రసాద్ ప్రయత్ని స్తున్నారని, ఆయన సొంత బంధువైన ఓ హెడ్ కానిస్టేబుల్‌తో డీఎస్పీ వెంకటేశ్వర్లు సీసీ కెమెరా ఫుటేజీ తీయించి సోషల్ మీడియాలో వైరల్ చేయించారనే ఆరోపణలు ఉన్నాయి. అంబికా ప్రసాద్ వైసీపీ వీరవిధేయుడిగా పేరుబడడంతో కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఆయన వీఆర్‌లోనే ఉన్నారు. ఈ అంత ర్గత రాజకీయాలవల్ల ప్రజలకు రక్షణ కల్పించాల్సిన విధుల్లో ఉండి యూనిఫాం పరువు బజారుకు ఈడుస్తున్నారంటూ ప్రజలు మండిపడుతున్నారు.

తాకట్టు బంగారం తారుమారు

● రూ. కోటి విలువైన బంగారం మాయం ● క్యూ కడుతున్న ఖాతాదారులు

తునిరూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తేటగుంటలో గుర్తింపు పొందిన కెనరా బ్యాంక్ కుదవపెట్టిన బంగారానికి భద్రత లేకుండాపోయింది. ఇంటి దొంగల పనితో కోటి విలువైన బంగారు ఆభరణాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయి. బంగారంపై అప్పులకు సంబంధించి అదే బ్యాంకులో 3500 ఖాతాలు ఉండగా వీటిలో 150కి పైబడి ఖాతాల్లో కోటి విలువగల కొన్ని ఆభరణాలు కానరాకుండా పోవడంపై ఖాతాదారులు ఆందోళనకు దిగుతున్నారు. ఇప్పటికే ఆశాఖ ఉన్నతాధికారులు బ్యాంకులో విచారణ చేపట్టి అవకతవకలకు బాధ్యులుగా ఉన్న బ్యాంక్ మేనేజర్‌తోపాటుగా మరో ఇద్దరు బ్యాంకు సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు ప్రస్తుత ఇన్‌చార్జ్ బ్రాంచ్ మేనేజర్ తెలుపుతున్నారు. బ్యాంక్ ఖాతాదారులు ఎవరూ ఆందోళన చెందనవసరంలేదని, తమ నగలకు పూర్తి భరోసా ఇస్తామని హామీ ఇస్తూ రాతపూర్వకంగా రాసి ఇచ్చినట్లు ఖాతాదారులు తెలిపారు.

వాట్సాప్ గవర్నెన్స్‌తో మ్యారేజ్ సర్టిఫికెట్



పాతయింజరం సచివాలయంలో మ్యారేజ్ సర్టిఫికెట్‌ను అందిస్తున్న సిబ్బంది

ఐ.పోలవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్‌ను అమలులోకి తెచ్చింది. దీంతో లబ్ధిదారులు ఇంటి వద్ద నుంచే సేవలు పొందే అవకాశం లభించింది. వివరాలను తమ మొబైల్ వాట్సాప్ ద్వారా సంబంధిత కార్యాలయానికి మెస్సేజ్ చేరవేస్తారు. అక్కడి సిబ్బంది పరిశీలించి అదేరోజు లబ్ధిదారుడి మొబైల్‌కు మెస్సేజ్ పెడతారు. తాజాగా పాతయింజరం సచివాలయంలో ఈవిధానంలో మ్యారేజ్ సర్టిఫికెట్ జారీ చేశారు. నూతన జంట ఎం.దుర్గాదేవి, ఆర్.దుర్గారావు వాట్సాప్ గవర్నస్ ద్వారా సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి పోతుల సూర్య అదేరోజు వారికి మ్యారేజ్ సర్టిఫికెట్ జారీ చేశారు. ఈ విధానం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదవశాత్తూ మహిళ మృతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలు అనుమానాస్పదంగా మృతి చెందడంపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనంద్‌నగర్‌లో పులవర్తి శోభ(72) తన భర్త పాలేశ్వరరావుతో కలిసి నివాసం ఉంటున్నారు. ఇంటి ఆవరణలోని ఎండుటాకులు, చెత్తా చెదారాన్ని ఆమె తరచుగా పోగేసి అగ్గి పెడతారు. ఈ క్రమంలో శనివారం మంట వేసి ప్రమాదవశాత్తూ ఆ మంటలో పడి కాలిన గాయాలుకావడంతో ఆస్పత్రికి తరలించారని.. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి



కొవ్వూరు, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందినట్లు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరు గామన్‌బ్రిడ్జి టోల్‌ప్లాజా సమీపంలో 55నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. మృతుడికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదన్నారు. అతని ఒంటిపై లైట్ నీలంరంగు చొక్కా, నలుపురంగు షార్ట్ ధరించి, కుడిచేతి వేలుకి ఏసు ప్రభువు బొమ్మ ఉంగరం ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేశారు. మృతుడికి సంబంధించి ఆచూకీ తెలిసిన వారు కొవ్వూరు పట్టణ పోలీస్‌స్టేషన్ 9440796622, 08813- 231100, 9154875583కు సమాచారం తెలపాలన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

కరప, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): బంధువుల వివాహ కార్యక్రమానికి వచ్చిన ఒక మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుపోయాడు. కరప పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. విజయనగరంజిల్లా డెంకాడ మండలం పెదతాడివాడ గ్రా మానికి చెందిన వెలమల నాగమణి శుక్రవారం రాత్రి కాకినాడజిల్లా కరప మండలం నడకుదురు వెలమ సంక్షేమ సంఘ భవనంలో జరుగుతున్న బంధువు బొంగు నాగభూషణరావు వివాహానికి హాజరయ్యారు. విందు అనంతరం రాత్రి 11గంటల సమయంలో పెండ్లికుమారుడు ఇంటికి వెళ్లడానికి తల్లితోకలిసి రోడ్డు దాటుతున్నారు. ముఖానికి మాస్క్ ధరించిన ఒక వ్యక్తి మోటార్‌సైకిల్‌పై వచ్చి ఆమె మెడలోని 50 గ్రాముల స్టెప్‌చైన్‌ను లాక్కుని వేగంగా వెళ్లిపోయాడు. స్థానికులు, బంధువులు వెంబడించినా చైన్ స్నాచర్ తప్పించుకుని పారిపోయాడు. దీనిపై బాధితురాలు కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తోట సునీత తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రావులపాలెం, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి):ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన రావులపాలెం మండలం లక్ష్మీపోలవరంలో జరిగింది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరుజిల్లా కొయ్యలగూడెం సమీపంలోని డిప్పకాయలపాడుకు చెందిన మద్దూరి శివన్నారాయణ శనివారం మధ్యాహ్నం లక్ష్మీపోలవరంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. అక్కడి నుంచి సమీపంలోని అరటితోటల్లోకి వెళ్లి ఒంటిపై పెట్రోల్‌పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు 108లో శివన్నారాయణను ముందు కొత్తపేట, అనంతరం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్యాభర్తల గొడవల కారణంగా ఇలాచేసి ఉండవచ్చునని బంధువులు ఆరోపిస్తున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా చేపట్టాలి

ప్రతి ఇంటి వద్ద సోప్‌పిట్ నిర్మించాలి: డ్వామా పీడీ నాగమహేశ్వరరావు



తొర్రేడు లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్రేడు కాలనీలో ఇళ్ల నిర్మాణాలు త్వరగా చేపట్టాలని డ్వామా పీడీ నాగమహేశ్వరరావు, ఎంపీడీవో శ్రీనివాస రావు అన్నారు. తొర్రేడులోని కాలనీని హౌసింగ్ అధికారులతో కలిసి పీడీ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంటి ముందు సోప్‌పిట్ నిర్మాణాలు చేపట్టాలన్నారు. 100 రోజుల కార్యక్రమంలో భాగంగా 112 లక్ష్యం కాగా 12 నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. అనంతరం కాలనీ వాసులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో తాగునీరు, విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని పూర్తిస్థాయిలో పరిష్కరించేలా చర్యలు చేపడతామని ఎంపీడీవో చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీకాంత్, ఎన్‌ఆర్‌జీఈఎస్ ఏపీవో సత్యవతి, పంచాయతీ కార్యదర్శి శకుంతల, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయాల ప్రతిష్ఠోత్సవాలు



చక్రద్వారబంధంలో ఆలయ ప్రతిష్ఠాపనలో భక్తులు

చక్రద్వారబంధం, రాజానగరంలో ఆధ్యాత్మిక సందడి

రాజానగరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చక్రద్వారబంధం, రాజానగరం గ్రామాల్లో నూతనంగా నెలకొల్పిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి, శ్రీవాసవీ మాత ఆలయ, ధ్వజ, శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శనివారం వైభవోపేతంగా జరిగాయి. దీనిలో భాగంగా మూడు రోజుల పాటు ఆయా ఆలయాల్లోని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేక హోమాలు నిర్వహించారు. చక్రద్వారబంధంలో వేంకటేశ్వర స్వామిని ఉదయం 10.54 గంటలకు ప్రతిష్ఠించగా, రాజానగరంలో శ్రీవాసవీ మాతను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. గోమాత దర్శనం అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ తనయులు పెందుర్తి అభిరామ్, పలువురు ప్రముఖులు, వ్యాపారవేత్తలు తరలివచ్చి దేవతామూర్తులను దర్శించుకుని, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

క్రీడలతో మానసికోల్లాసం: ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): క్రీడలు విద్యార్థులకు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. స్థానిక రైల్వే క్రీడామైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న భాష్యం బాలుర ఇంట్రా జోనల్ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతులు ప్రదానం జరిగింది. దీనికి ఎమ్మెల్యే గోరంట్లతోపాటు ప్రకాష్‌నగర్ సీఐ బాజీలాల్, భాష్యం జోనల్ ఇన్ చార్జి ఆంజనేయులు విచ్చేసి మా ట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమం లో భాష్యం ప్రిన్సిపాల్స్ పి.హరిబాబు, కేవీవీ సత్యనారాయణ, పి.దుర్గాప్రసాద్, పార్వతిరెడ్డి, వై.రాహుల్, జె.సూర్యనారాయణ, పి.పేరయ్యనాయుడు, పీఈటీలు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేస్తా

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యేగోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో గోదావరి బోటు మత్స్యకారుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం శనివారం జరిగింది .దినికి గోరంట్ల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడుగా మల్లాడి ఆంజనేయులు, కార్యదర్శిగా పాలెపు తులసీదాస్, ఉపాధ్యక్షుడిగా మల్లాడి సతీష్, సంయుక్త కార్యదర్శిగా మల్లాడి సుబ్బు, కోశాధికారిగా నాటి రామకృష్ణ, మరో ఐదుగురు కార్యవర్గ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. వారిని గోరంట్ల అభినందించారు. తమ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మత్స్యకారులను అన్నివిధాల ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో టూరిజం డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, రెడ్డిమణి, అడబాల రామకృష్ణారావు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం

దివాన్‌చెరువు, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, కళాశాల యువత, వృద్ధులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరమని ఆదిత్యబిర్లా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యక్రమ కోఆర్డినేటర్ పి.సుధాకర్ అన్నారు. ఆదికవి నన్నయ వర్సిటీలో ఆదిత్యబిర్లా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వారు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. శిక్షణకు సంబంధించిన కిట్లను వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు విద్యార్థులకు అందించారు. ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, కోర్సు కోఆర్డినేటర్ సీహెచ్ఎస్‌కే భవాని, అధ్యాపకులు పి.రాజశేఖర్, ఎస్‌వీవీఎస్ నారాయణ పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

సీతానగరం, ఫిబ్రవరి 15 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గల పోలింగ్ బూత్‌లను శనివారం తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, డీఎస్పీ వై.శ్రీకాంత్, కోరుకొండ సీఐ సత్య కిషోర్, ఎస్ఐ డీ. రామ్‌కుమార్ పరిశీలించారు. మండంలోని 1505 మంది ఓటర్లు ఉన్నారని, వారికి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని తహసీల్దార్ తెలిపారు. పోలింగ్ బూత్‌లో గాలి వెలుతురు, విద్యుత్ ,తాగునీరు సదరుపాయాలు వంటి పలు అంశాలను పరిశీలించడం జరిగిందన్నారు. అనంతరం వంగలపూడి ర్యాంపు చేరుకుని పట్టిసం వీరభద్రుని ఆలయానికి వెళ్లే నడక దారి మార్గాన్ని పరిశీలించారు. అక్కడ గోదావరి పాయ ఉన్నందున ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చేయాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. గోదావరిలో నీటిమట్టం ఎక్కువగా ఉన్నందున రామచంద్రాపురం గోదావరి ర్యాంపును పరిశీలించారు. ఎక్కడ అనుతిస్తారో పరిశీలించి తెలియబరుస్తామన్నారు.



బూత్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్, పోలీసులు

బీసీలకు 'ఆదరణ' ఎంతో మేలు : ఎమ్మెల్యే

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలో బీసీలకు అమలు చేసిన ఆదరణ పథకం ఎంతో మేలు చేసిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వెనుకబడిన తరగతుల కులవృత్తులను ప్రోత్సహించేందుకు ఆదరణ - 3 పథకాన్ని పునరుద్ధరించేందుకు సీఎం చంద్రబాబు పచ్చ జెండా ఊపడం ఆనందదాయకమన్నారు. తమది బీసీల ప్రభుత్వమని, ఆనాడు వైసీపీ వాళ్లు పట్టించుకోలేదన్నారు. పనిముట్లు ఇవ్వక పోగా చెల్లించిన డీడీలను కూడా తిరిగి వెనక్కి ఇవ్వలేని దుస్థితి ఆనాటి ప్రభుత్వమిదన్నారు. కులవృత్తుల పని సులభతరం చేయడంతో పాటు ఆదాయాన్ని పెంచేలా కొత్త పరికరాలను అందించాలన్నదే తమ కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను ఒక్కొక్కటిగా సరి చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన ప్రతి హామీ అమలుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



దేవరపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయడానికి అధికారులు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎస్.సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం హౌసింగ్ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేసే దిశగా అవగాహన కల్పించాలన్నారు. మండలానికి 2,900 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 370 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని, ఇంకా 190 ఇళ్లు నిర్మాణదశలో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ధర్మారావు, పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ సిబ్బది, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం/పెరవలి: లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి అనిల్‌వినయ్ పేర్కొన్నారు. పెరవలి మండలం తీపర్రులో శనివారం లబ్ధిదారులతో జరిగిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, హౌసింగ్ ఏఈ ఎం. విక్టర్‌బాబు, పీఆర్ఏఈ శ్రీమన్నారాయణ, డ్వాక్రా ఏపీఎం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీ,డీ గ్రేడు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

బిక్కవోలు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఒకటి నుంచి పదో తరగతి వరకూ సీ, డీ గ్రేడుల్లో వున్న విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి సీహెచ్‌వీవీ సత్యనారాయణ కోరారు. బిక్కవోలు ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటైన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమికంగా 1, 2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు, 3 నుంచి 5 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు, 6నుంచి 10వరకూ బోధించే టీచర్లకు ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించారు. ప్రతి నెల మూడో శనివారం ఉదయం పాఠశాలలు నిర్వహించి మధ్యాహ్నం నుంచి కాంప్లెక్స్ సమావేశాలకు హాజరు కావాలని ఎంఈవో సూచించారు. అలాగే ఊలపల్లి, కొంకుదురు ఉన్నత పాఠశాలల్లో కూడ కాంప్లెక్స్ సమావేశాలు జరిగాయి.

పోలీస్‌స్టేషన్‌కు కంప్యూటర్ బహూకరణ



సీఐ వెంకటేశ్వరరావుకు కంప్యూటర్ అందజేస్తున్న సర్వారాయ ఉద్యోగులు

కడియం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కడియం పోలీస్‌స్టేషన్‌కు సర్వారాయ బాట్లింగ్ యూనిట్ సుమారు రూ.70 వేలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్, మోనిటర్, కీబోర్డును శనివారం అందజేసింది. ఈ సందర్భంగా సీఐ ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వేమగిరి సర్వారాయ బాట్లింగ్ పరిశ్రమ యాజమాన్యం పలువురికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు సీఎస్ఆర్ నిధులతో సామాజిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్వారాయ ఫ్యాక్టరీ సీఎఫ్‌వో కె.శ్రీధర్, హెచ్‌ఆర్ మేనేజర్ కె.కృష్ణమూర్తి, అసిస్టెంట్ హెచ్‌ఆర్ మేనేజర్ డి.సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్ విద్యార్థులకు యూనిఫామ్ అందజేత

కడియం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కడియం ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.10 వేలు విలువ చేసే స్కౌట్ యూనిఫామ్‌ను శనివారం పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ అధ్య క్షులు పల్ల సత్తిబాబు, సుబ్రహ్మణ్యం, గణపతి అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సేవలను హెచ్ఎం టి.సత్యనారాయణ అభినందించారు. కార్యక్రమంలో పల్ల వెంకటేష్, పల్ల వినయ్, గైడ్ టీచర్ బి.గిరిజ, గైడ్ సహాయకురాలు వై.వీరరాఘవకుమారి, డేవిడ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై చైతన్య వంతులను చేయాలి

అనపర్తి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సమాజంలో పౌష్టికాహార లోపంతో జరుగుతున్న అనర్థాలను అధిగమించేందుకు ప్రభుత్వం ఎంతో విలువైన పోషక పదార్థాలను అందిస్తోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అన్నారు. మూడు రోజులుగా అనపర్తిలోని బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పోషణ్ బీ పడాయి బీ శిక్షణా కార్యక్రమాలు శనివారం ముగిసాయి. మూడు రోజులపాటు పౌష్టికాహారంపై అవగాహనతో బాటు ఆహారం తీసుకోవాల్సిన పద్దతులపై అంగన్‌వాడీలకు శిక్షణను అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఆర్.ఛాయాదేవి, యు.పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాజాన్ని చైతన్యవంతం చేయడమే లక్ష్యం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని చైతన్యవంతం చేసేందుకు హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ సెల్ సంస్థను ఏర్పాటు చేశామని ఆ సంస్థ అధ్యక్షుడు ఎస్‌కే అహ్మద్ ఆలీ తెలిపారు. శనివారం రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సంస్థ ద్వారా చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, వైద్య సహాయం, యాంటీ ర్యాగింగ్, మహిళ సమస్యలపై అవగాహన, న్యాయసహాయంపై సలహాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో సంస్థ ఉపాధ్యక్షుడు ఎస్‌కే సీరాజుద్దీన్, బిందు మాధురి, బి.ప్రవీణ్ కుమార్, సయ్యద్ కాజా, సీహెచ్ తాతారావు, ఎండీ షబ్బీర్ పాల్గొన్నారు.

ఎస్‌జేఎఫ్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్య ఓటు వేయండి

రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ సింగరయ్య

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి ఎస్‌జేఎఫ్ (సోషల్ జస్టిస్ ఫోరం) అభ్యర్థిగా పోటీ చేస్తున్న జేటీ రామారావుకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ జంగాల సింగరయ్యయాదవ్, కన్వీనర్ రావి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, ఉత్తరాంధ్ర జిల్లాల్లో పోటీ చేస్తున్న ఎస్‌జేఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. బీసీలకు 34శాతం రిజర్వేషన్లు అమలు చేయడమే తమ నినాదమన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీడీజీ మురళీ అన్నారు. శనివారం ఆయన నేతృత్వంలో జిల్లాలో 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న 7స్కిల్ హబ్‌లలోను, నైపుణ్య కళాశాలలోను శిక్షణపొందుతున్న ట్రైనీలు హబ్‌కోఆర్డినేటర్‌తో కలిసి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి



వైటీసీలో జరిగిన కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా అధికారులు

- జిల్లా పంచాయతీ అధికారి శాంతామణి
- పలుచోట్ల స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా మనం నివసించే ప్రాంతాలు, కార్యాలయాల్లో ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఒక స్ఫూర్తిగా కొనసాగిస్తామని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి వి.శాంతామణి అన్నారు. ప్రతినెల 3వ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వైటీసీ ఆవరణలో జిల్లా అధికారులతో కలిసి స్వచ్ఛాంధ్ర- క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారు చేసే విధానంలో ప్రజలను భాగస్వాములను చేస్తామని, ఇందుకు సంబంధించి చెత్త సేకరణ చేపడతామన్నారు. ప్రజల నుంచి చెత్త సేకరించిన చెత్తను నేరుగా సంపద తయారీ కేంద్రాలకు తరలించి సంపద సృష్టించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఇందుకు అధికారులను, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి సీహెచ్ శ్రీనివాస్, జిల్లా సూక్ష్మ సేద్య అధికారి ఎ.దుర్గేష్, డ్వామా పీడీ ఎ.నాగమహేశ్వరరావు, ఫుడ్ సేఫ్టీ అధికారి రుక్కయ్య, మార్క్‌ఫెడ్ డి.ప్రతాప్, అగ్నిమాపక, జిల్లా పరిశ్రమల అధికారి, సంబంధిత సిబ్బంది, ధవళేశ్వరం పంచాయతీ కార్యదర్శి జి.వెంకట్రావు పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: స్థానిక నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని నాలుగు కళాశాలల విద్యార్థులు శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రత సమష్టి బాధ్యత అని, ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించడంతో బాటు పచ్చదనాన్ని పరిరక్షించాలన్నారు. విద్యార్థులు ఒకరోజుకు మాత్రమే పరిమితం చేయకుండా నిత్యం ఈ అలవాటును కలిగి ఉండాలన్నారు. యూనివర్శిటీ ప్రధాన రహదారికి ఇరువైపులా, కేంద్ర గ్రంథాలయం ఎదురుగా పరిపాలనా భవనం ప్రాంగణంలో, కన్వెన్షన్ సెంటర్ సమీపంలో, సైన్స్ కళాశాల భవన పరిసరాలలో చెత్తను, వ్యర్థాలను ఏరివేసి శుభ్రపరిచారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తి సచివాలయం-5 పరిధిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి, ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి తదితరులు పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు.కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా వస్తే పెట్టుబడులు అవే వస్తాయి



సదస్సులో మాట్లాడుతున్న తాటిపాక మధు

సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కేంద్రం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తే పెట్టుబడులు వాటంతట అవే వస్తాయని, యువతకు ఉద్యోగాలు, ప్రజలకు ఉపాధి దొరుకుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. శనివారం స్థానిక మెరకవీధిలో జట్ల లేబర్ యూనియన్ మేస్త్రీల సమావేశం యూనియన్ అధ్యక్షుడు కూండ్రపు రాంబాబు అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాల్గొన్న మధు మాట్లాడుతూ ఖజానా ఖాళీ అంటూ ఎన్నికల్లో ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబుకు రాష్ట్ర ప్రజలు అప్పుల్లో ఉన్న విషయం తెలియదా అని అన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. 8 నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వంపై అసంతృప్తి మొదలైందని, కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందన్నారు. స్మార్టుమీటర్లు పెట్టే విషయంలో గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా లేదన్నారు. కాకినాడ తీరంలోని గ్యాస్, చమురు నిక్షేపాల్లో మనకు రావాల్సిన వాటాను కోరుతూ ఈనెల 23న కాకినాడలో సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. సదస్సులో జట్ల సంఘం ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, దేముడు బాబు, దుర్గా ప్రసాద్‌రెడ్డి, వెంకటరావు పాల్గొన్నారు.

ఏఐతో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు



వైద్య విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న రత్తయ్య, డాక్టర్ గన్ని భాస్కరరావు తదితరులు

- గుంటూరు విజ్ఞాన్ యూనివర్శిటీ చాన్సలర్ లావు రత్తయ్య
- జీఎస్ఎల్ మెడికల్ కళాశాల 17వ గ్రాడ్యుయేషన్ డే

రాజానగరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) (కృత్రిమ మేధస్సు) విప్లవాత్మక మార్పులు సంతరించుకోనున్నాయని గుంటూరు విజ్ఞాన్ యూనివర్శిటీ చాన్సలర్ లావు రత్తయ్య పేర్కొన్నారు. రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాల 17వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల పల్లెలు, పట్టణాలు, నగరాలకు మధ్య అంతరాలు చెరిగిపోతాయని, వ్యాధి నిర్ధారణ, చికిత్సా విధాన ప్రక్రియల్లో భవిష్యత్తులో పెనుమార్పులు వస్తాయన్నారు. వ్యాధులను సులువుగా గుర్తించడానికి వీలుగా ఆధార్ వంటి గుర్తింపు కార్డులపై ఆయా వ్యక్తుల జీన్స్ కూడా నమోదు చేసే పరిస్థితి వస్తోందన్నారు. మరో ముఖ్యఅతిథి బెంగుళూరులోని నిమ్ హాన్స్ మాజీ ప్రొఫెసర్, సుప్రసిద్ధ న్యూరో సర్జన్ డాక్టర్ మల్లా భాస్కరరావు మాట్లాడుతూ జీవనశైలిలో మార్పుల వల్ల వైద్యులు కూడా జబ్బుపడడం, దృష్టి కేంద్రీకరించలేకపోవడం జరుగుతోందని, దీనిని దృష్టిలో ఉంచుకుని క్రమం తప్పకుండా నడక, వ్యాయామాలు, చాలినంత నిద్ర కూడా వైద్యులకు ముఖ్యమన్నారు. అనంతరం వైద్య విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.గురునాథ్, సూపరింటెండెంట్ డాక్టర్ టీవీఎస్‌పీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



- ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భూదేవి, దుర్గమణి
- అంగన్‌వాడీలకు ముగిసిన శిక్షణ

దివాన్‌చెరువు/రాజానగరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలంలోని రాజానగరం, దివాన్‌చెరువు, పుణ్యక్షేత్రం సెక్టారుల లో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు రాజానగరం, పాతతుంగపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో మూడురోజులుగా జరుగుతున్న పోషణ్ బీ పడాయి బీ శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసినట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎన్.భూదేవి, ఎస్‌కే దుర్గమణి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఆరోగ్యం, శుభ్రత, పిల్లల పెంపకంపై సంరక్షకుడి అవగాహన వర్కర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక మార్గదర్శకాలు అవలంబించాలన్నారు. దివాన్‌చెరువు, పుణ్యక్షేత్రం సెక్టార్ల నుంచి 47 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణ పొందారని భూదేవి చెప్పారు. అలాగే హైస్కూల్ హెచ్ఎం బీఆర్ కమలాదాస్, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పలు అంశాలపై ప్రసంగించారు. అనంతరం వర్కర్లంతా ప్రతిజ్ఞ చేశారు.

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం జడ్పీ హైస్కూల్లో సీడీపీవో జె.రూప్సీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముగ్గళ్ల, సీతానగరం సెక్టార్లకు సంబంధించిన 48 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు సూపర్‌వైజర్లు కె.పెదలక్ష్మి, ఎం.వరలక్ష్మి శిక్షణ ఇచ్చారు. నవజాతి శిశువుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అంగన్‌వాడి కేంద్రాల ద్వారా అందించే సేవలు, పిల్లలకు అందించే అనుబంధ ఆహారంపై వివరించారు.

బీజేపీని బలోపేతం చేయాలి



కోరుకొండ, సీతానగరం మండలాల నూతన కమిటీల సభ్యులు

- జిల్లా అధ్యక్షులు నాగేంద్ర
- నూతన కార్యవర్గాల ఎన్నిక

కోరుకొండ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో పురోగమిస్తుందని ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీని బలోపేతం చేయాలని పార్టీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం కోరుకొండలో కోరుకొండ, సీతానగరం మండలాల నాయకులు, కార్యకర్తల సమావేశం నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు ఏపీఆర్ చౌదరి మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకులతో సమైక్యంగా పని చేస్తూ బీజేపీ ఉనికిని నిరూపించుకోవాలన్నారు. వీరన్న చౌదరి మాట్లాడుతూ ప్రతి మండలంలోను సుమారు 500 మంది నాయకులు, కార్యకర్తలు బీజేపీ కోసం నిరంతరం పని చేస్తున్నారని పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోరుకొండ మండలాధ్యక్షుడిగా అడపా సుధీర్‌కుమార్, సీతానగరం మండల మండలాధ్యక్షురాలిగా రాపాక వెంకటలక్ష్మి, ఇతర కమిటీ సభ్యులు కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండు మండలాల బీజేపీ మండలశాఖ కార్యవర్గ సభ్యులందరికీ పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని కొంకుదురులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో బిక్కవోలు, పెదపూడి మండలాల నూతన కార్యవర్గ సభ్యుల ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి ఇంత పెద్ద ఎత్తున ప్రయోజనాలు చేకూర్చడం బీజేపీతోనే సాధ్యమయ్యిందన్నారు. ఆంధ్రాను స్వర్ణాంధ్రగా మార్చడమే బీజేపీ లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర అన్నారు. అనంతరం బిక్కవోలు, పెదపూడి మండల అధ్యక్షులుగా ఎంపికైన గుడిమెట్ల దుర్గారెడ్డి, ముమ్మిడి శివ, కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ శివరామకృష్ణంరాజు, కూటమి నాయకులు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, పడాల రాము, రావాడ నాగు, జుత్తుగ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: బీజేపీ సంఘటన నిర్మాణంలో భాగంగా రాజమహేంద్రవరం నగరంలో 9వ మండలానికి శనివారం మండల కమిటీని నియమించారు. మండలాధ్యక్షురాలు ఎర్ర నాగదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ జాతీయ పార్టీ, రాష్ట్ర పార్టీ ఆలోచలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలంటే మండల కమిటీలు ఎంతో కీలకమన్నారు. నూతన కమిటీ ద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడటానికి ఈ కమిటీలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా టీచర్ల కన్వీనర్ బాబ్జీ, ధార్మిక సెల్ కో కన్వీనర్ చాగంటి నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.



బిక్కవోలు మండల బీజేపీ కార్యవర్గ సభ్యులు





కొమ్ము తలపాగాతో కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్

మార్చ్‌ఫాస్ట్

సివిల్ పవర్ చూపుతాం!

కలెక్టర్లు.. ఎస్పీలూ క్రీడా పోటీలు ఊహించగలమా.. కాస్త కష్టమే.. ఎందుకంటే జిల్లాకో కలెక్టర్.. ఎస్పీ ఉంటారు.. వీళ్ల మధ్య క్రీడాపోటీలు ఎలా జరుగుతాయని ఆశ్చర్యపోతున్నారా!? 2024 -25 సివిల్ సర్వీసెస్ ఆలిండియా పురుషులు.. మహిళల హాకీ టోర్నమెంట్ కాకినాడ జిల్లా క్రీడామైదానంలో శనివారం నుంచి ప్రారంభమైంది.. సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన క్రీడాకారులు 44 జట్లుగా ఏర్పడి తలపడుతున్నారు.. మన మధ్యకు వచ్చి ఈ నెల 28వ తేదీ వరకూ మేమూ ఆడతాం.. ప్రతిభ చాటుతాం అంటున్నారు.. - వివరాలు 6లో



ఆట..హాకీ..



క్రీడాజ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్, ఎస్పీ

మా ఆట చూపుతాం : క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్



మార్కెట్.. చిక్కేనా!

సండే.. చికెన్ ఆశలు

వండుకు తింటే.. ప్రభావం ఉండదంటున్న వైద్యులు



ఆదివారం అంటేనే నాన్‌వెజ్ డే. మాంసాహార ప్రియులు ఎప్పుడొస్తుందా ఎదురుచూసే రోజు. ఆ రోజు ముక్కలేనిదే ముద్ద దిగదు.. చికెన్, మటన్, చేప, రొయ్యలకు డిమాండ్.. వీటిలో చికెన్ అంటే పెద్దలు, పిల్లలూ ఇష్టపడతారు. అందులోనూ చికెన్ బిర్యానీదే పైచేయి. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో ఈ ఆదివారం మాంసాహార ప్రియులు ఎలా స్పందిస్తారోననే ఉత్కంఠ నెలకొంది. వారాంతపు రోజు కావడంతో ఈ ఒక్కరోజే వందలాది టన్నుల చికెన్ అమ్మకాలు, లక్షలాది గుడ్ల అమ్మకాలు సాగేవి. ప్రస్తుతం బర్డ్ ఫ్లూ ప్రభావంతో కొన్నిచోట్ల చికెన్ అమ్మకాలు పడిపోయాయి. హోటళ్లలోనూ ఆర్డర్లు పడిపోయాయి. ఈ నేపథ్యంలో నష్ట నివారణకు కోళ్ల పరిశ్రమ రంగంలోకి దిగింది. ప్రభుత్వం కూడా కొంత అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టింది. చికెన్ వండుకుని తినడం వల్ల ఎలాంటి హాని జరగదని వైద్యులు సైతం చెబుతున్నారు. కోడి గుడ్ల విషయంలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఆదివారం రానేవచ్చింది.. నేడు పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన పరిశ్రమ వర్గాల్లో నెలకొంది. సాధారణ పరిస్థితి ఏర్పడితేనే కోళ్ల పరిశ్రమ బయటపడే అవకాశం ఉంది.

అనపర్తి/మండపేట/ఉండ్రాజవరం/ అమలాపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ వచ్చిందని తెలియగానే చాలాచోట్ల చికెన్ దుకాణాలు మూతపడ్డాయి. బర్డ్‌ఫ్లూ సోకిన కోడిని సైతం వండుకుని తింటే మనుషులకు ఏమీ కాదని ఒకవైపు ప్రచారం జరుగుతున్నా ఇదిగో పులి అంటే అదిగో మేక అన్న చందంగా అసత్య ప్రచారాలతో కోడిమాంసం, గుడ్లు అమ్మకాలు పడిపోయాయి. దీంతో రైతులు కోళ్ల రేట్లను గణనీయంగా తగ్గించారు. మొన్నటి వరకు లైవ్ బాయిలర్ కిలో రూ.115 నుంచి 120 ఉండగా ప్రస్తుతం అది రూ.80 నుంచి రూ.90 వరకు ఉంది. ఫారం కోడి ధర లైవ్ రూ.90 పలుకగా ఇప్పుడు రూ.70కు ఇస్తున్నారు. ఇక గుడ్ల ధర విషయానికి వస్తే మొన్నటి వరకు పేపరు ధర రూ.4.90 ఉండగా నేడు రూ.4.55కు పడిపోయింది. కొన్ని చోట్ల ట్రేడర్లు మరింత దిగువకు కొనుగోలు చేస్తున్నారని పరిశ్రమ వర్గాలు ఒకటే గగ్గోలు పెడుతున్నాయి. మరోవైపు పౌల్ట్రీల వద్ద బర్డ్‌ఫ్లూ సోకకుండా తమ కోళ్లను రక్షించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్క కానూరు మినహా మిగిలినచోట్ల బర్డ్‌ఫ్లూ వ్యాపించిన ఘటనలు లేవు. అయినా మొత్తం మార్కెట్‌పై బర్డ్‌ఫ్లూ ప్రభావం చూపుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోనసీమలో గుడ్లు ఇవ్వండి!

కోనసీమ జిల్లాలో ఇప్పటి వరకూ ఎక్కడ ఒక్క బర్డ్‌ఫ్లూ కేసు నమోదు కాలేదు. జిల్లాలో 52 కమర్షియల్ పౌల్ట్రీ ఫార్మ్‌లో 32 లక్షల కోళ్లు, బ్యాక్యార్డ్ పౌల్ట్రీల్లో 24 లక్షల కోళ్లు ఉన్నాయి. వీటిలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపించలేదు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, హాస్టళ్లలో తిరిగి కోడిగుడ్లను బాగా ఉడికించి పిల్లలకు అందించండి. జిల్లాలో 10 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి కోళ్లు, కోళ్ల ఉత్పత్తులు జిల్లాలోకి రావడంపై ఆంక్షలు విధించాం. బర్డ్‌ఫ్లూ కేసులు లేనందున జిల్లాలోకి అనుమతించండి. మాంసం విక్రయదారులపై ఆంక్షలు విధించవద్దు.

- మహేష్‌కుమార్, కలెక్టర్

మటన్‌కు డిమాండ్.. కానీ..

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చికెన్‌ప్రియులను బర్డ్‌ఫ్లూ భయపెడుతుండడంతో గత కొద్దిరోజులుగా రాజమహేంద్రవరం సిటీలో చికెన్ అమ్మకాలు గణనీయంగా తగ్గిపోయాయి. సిటీలోనే ప్రధాన కోళ్ల మార్కెట్‌గా పేరొందిన జాంపేట కోళ్ల మార్కెట్ శనివారం దాదాపుగా బోసిపోయి కనిపించింది. ఇదిలా ఉంటే బర్డ్‌ఫ్లూ భయంతో చాలా హోటళ్లలో మెనూ మారిపోయింది. కర్రీ పాయింట్లలోనూ చికెన్‌కు ప్రాధాన్యం తగ్గింది. చికెన్ స్థానంలో కొత్తగా మటన్ వచ్చి చేరుతోంది. చాలామంది హోటల్ యజమానులు చికెన్ వెరైటీలను తగ్గించేసి మటన్ ప్రమోట్ చేస్తున్నారు. దీంతో మటన్ వ్యాపారులు ఒక్కసారిగా ధరలు పెంచేశారు. బర్డ్‌ఫ్లూ ముందు వరకూ కిలో రూ.800-రూ.880 ఉన్న కిలో మటన్ ధర ఇప్పుడు రూ.950కి చేరి సామాన్యులకు అందుబాటులో లేకపోయింది.



- బర్డ్‌ఫ్లూ దెబ్బకు మార్కెట్ కుదేలు
- చికెన్‌కు దూరమైన జనం
- తినేందుకు జంకుతున్న వైనం
- ఏమీ కాదంటున్న వైద్యులు
- అయినా మారని తీరు
- అసత్య ప్రచారాలతో నష్టాలు
- పడిన గుడ్ల వినియోగం
- రూ.4.50కు గుడ్డు ధర
- చికెన్ ధర తగ్గుముఖం
- యజమానుల లబోదిబో

కోట్లలో నష్టపోతున్నాం..

రాష్ట్రంలో కోడిగుడ్ల ఎగుమతులపై బర్డ్‌ఫ్లూ ప్రభావం పడడం వల్ల పౌల్ట్రీ పరిశ్రమకు తీవ్రంగా నష్టం జరుగుతోంది. దీనివల్ల రోజుకు రూ.2.5 కోట్లు నష్టపోతున్నాం. ఇక మాంసానికి విక్రయించే కోళ్ల నష్టం రోజుకు సుమారు రూ.కోటి వరకు ఉంటుంది. కోడిగుడ్లు, మాంసానికి విక్రయించే కోళ్ల వాహనాలను రాష్ట్ర సరిహద్దుల్లో నిలిపివేస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు ఎగుమతుల నిలుపుదలతో పాటు స్థానికంగానూ గుడ్ల వినియోగం గణనీయంగా తగ్గిపోయింది. అంగన్‌వాడీ కేంద్రాలకు, మధ్యాహ్న భోజన పథకానికీ గుడ్లను నిలిపివేశారు.

- కోమట్లపల్లి వెంకట సుబ్బారావు, పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు



సన్‌డే..ఆశలు

చికెన్ అమ్మకాలు గణనీయంగా పడిపోవడంతో మొన్నటి వరకు కిలో రూ.220 అమ్మిన స్కిన్‌లెస్ బాయిలర్ మాంసం ధర నేడు రూ.190కి పడింది. అయినప్పటికీ తగ్గకుండా ధర నిలబెట్టేందుకు పరిశ్రమ ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే వైద్యులు సైతం చికెన్, గుడ్లు పచ్చివి మాత్రమే తినకూడదని.. వండిన తర్వాత ఎలాంటి వైరస్ ఉండదని.. కాబట్టి తినొచ్చని చెబుతుండడంతో ఆదివారం మార్కెట్ తమను ఆదుకుంటుందనే ఆశతో కోళ్ల రైతులు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో నిత్యం 30 వేల బాయిలర్ కోళ్ల విక్రయాలు జరుగుతుంటాయి. ఆదివారం 50 వేలకుపైబడి బాయిలర్ కోళ్లను విక్రయిస్తారు. లేయర్ కోళ్ల విషయానికి వస్తే 25 వేల కోళ్ల విక్రయాలు సాగుతుండగా, ఆదివారం ఒక్కరోజే 40 వేల కోళ్లు విక్రయిస్తారు. ఈ ఆదివారం మార్కెట్ చిక్కాలని ఆశగా ఉన్నారు.



గుడ్డుకు.. బ్యాడ్ డేస్..

బర్డ్‌ఫ్లూ దెబ్బకు చికెన్ వినియోగంతోపాటు గుడ్ల విక్రయాలు గణనీయంగా తగ్గాయి. నిన్న మొన్నటి వరకు రూ.4.90 పలికిన గుడ్డు ధర ఇప్పుడు రూ.4.55కు పడిపోయింది. చిల్లర ధర మాత్రం నేటికీ రూ.6లు ఉన్నప్పటికీ వినియోగదారులు మొగ్గు చూపకపోవడంతో చిల్లర అమ్మకాలు నిలిచిపోయాయి.ఈ ప్రభావం కేక్‌లపై కూడా పడింది. చాలామంది కేక్‌లు తినేందుకు ఇష్టపడడం లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గుడ్ల ఉత్పత్తి 1.30 కోట్ల మేర ఉండగా స్థానికంగా వినియోగం 30 శాతం ఉంటుంది. మిగిలిన 70 శాతం గుడ్లు పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, అస్సాం, మేఘాలయ తదితర రాష్ట్రాలకు ఎగుమతవుతాయి. ఈశాన్య రాష్ట్రాల్లో గుడ్ల ఉత్పత్తి తగ్గడంతో మన ఎగుమతులపై ఎలాంటి ప్రభావం పడలేదు. కానీ ట్రేడర్లు బర్డ్‌ఫ్లూ భూతం చూపి కొంత ధర తగ్గించినట్టు చెబుతున్నారు.

లెక్కతేలిన ఎమ్మెల్సీ ఓటర్లు

మొత్తం ఓటర్లు 3,14,984

అత్యధికం కాకినాడ జిల్లా.. ఓటర్లు 70,504

అత్యల్పం అల్లూరు జిల్లా .. ఓటర్లు 4,669

తూర్పుగోదావరి జిల్లా ఓటర్లు.. 62,970

- లోపల పేజీలో

హైదరాబాద్ నుంచి వచ్చి ఆసుపత్రిలో మహిళ మృతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కపిలేశ్వపురానికి చెందిన ఇనాగలక్ష్మీ దుర్గ(28) తన భర్త ముగ్గురు పిల్లలతో కలిసి తెలంగాణలోని శంషాబాద్‌లో నివాసం ఉంటున్నారు. అయితే స్త్రీ సంబంధిత ఆరోగ్య సమ్యలవల్ల ఆమె బాధపడుతూ ఈ నెల 1న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయ్నానికి పాల్పడింది. రాజమహేంద్రవరంలోని తెలిసిన వ్యక్తి సూచనతో వైద్యానికి ఇక్కడికి వచ్చారు. హైవేలోని బొమ్మూరు పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. దీనిపై ప్రకాశం నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి మృతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి):ఓ వృద్ధురాలు అనుమానాస్పదంగా మృతిచెందడంపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.సీఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం..ఆనంద్ నగర్‌లో పులపర్తి శోభ(72) తన భర్త పాలేశ్వరరావుతో కలిసి నివాసం ఉంటున్నారు. ఇంటి ఆవరణలోని ఎండుటాకులు, చెత్తా చెదారాన్ని ఆమె తరచుగా పోగేసి అగ్గి పెడతారు. శనివారం మంట వేసి ప్రమాదవశాత్తూ ఆ మంటలో పడి కాలిన గాయాలపాలైంది. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్టు పేర్కొన్నారు.



శెహబాస్..ఆర్టీసీ డ్రైవర్స్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రతా నియమాలను వాహనదారులందరూ పాటించాలని జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ అన్నారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలో శనివారం సాయంత్రం రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా 23 మంది ప్రమాదరహిత డ్రైవర్లను సన్మానించారు. రోడ్డు భద్రతకు సంబంధించి నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో డీటీవో సురేష్, జిల్లా అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ, ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల అశోక, కొవ్వూరు,నిడదవోలు, రాజమహేంద్రవరం, గోకవరం డిపోల మేనేజర్లు, ఆయా ఆర్టీసీ డిపోల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘ నాయకులు

ఆప్కాస్ రద్దు వార్తలను ఖండిస్తున్నాం

జిల్లా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సుమన్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ నాయకులు డిమాండ్ చేశారు.రాజమహేంద్రవరంలో శనివారం జరిగిన ఆప్కాస్ ఉద్యోగుల జిల్లా స్థాయి సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కె.సుమన్, సహాధ్యక్షుడు గంట సంపత్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.గురునాథ్ మాట్లాడారు. ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేయాలని భావిస్తే ప్రత్యామ్నాయం చూపించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆప్కాస్‌ను రద్దు చేస్తున్నట్టు వస్తున్న ప్రకటనలను ఖండిస్తున్నామన్నారు.అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు నల్లమిల్లి ఆదిరెడ్డి, నాయకులు సుశీల, ఎస్.సుధాకర్, పి.లోవరాజు, ఎడ్ల బుజ్జిబాబు , సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ప్రాణం తీసిన.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

- రోడ్డుకు అడ్డంగా పైపులు
- కానరాని హెచ్చరిక బోర్డు
- బైక్‌తో ఢీకొట్టిన యువకుడు
- రాత్రి కనిపించకపోవడమే కారణం?



రోడ్డుకు అడ్డంగా ఉన్న పైపులను ఢీకొని మృతిచెందిన యువకుడు



రాజమహేంద్రవరంసిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ గుత్తేదారుడి నిర్లక్ష్యానికి శుక్రవారం రాత్రి ఒక యువకుడు బలయ్యాడు. రాజమహేంద్రవరం వీవీ గార్డెన్స్‌కు చెందిన పాస్టర్ కన్నాన్ రాజు కుమారుడు కాకర్లపూడి విజయరూపస్ ఎంబీఏ చదువుకున్నాడు. పార్ట్ టైం జాబ్‌గా ఫ్లవర్ డెకరేషన్ చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఒక ఫంక్షన్‌కు ఫ్లవర్ డెకరేషన్ నిమిత్తం ఫ్లవర్స్ కొనుగోలు చేసేందుకు వీవీ గార్డెన్స్ నుంచి బైక్‌పై బయలు దేరాడు. గోరక్షణ పేట సెంటర్‌కు వచ్చేసరికి అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద రోడ్డుకు అడ్డంగా రెండు భారీ పైప్‌లు పెట్టిఉండడాన్ని గమనించలేకపోయాడు.నేరుగా పైప్‌లను బైక్‌తో ఢీకొట్టడంతో బైక్ హ్యాండిల్ తలకు ,చాతికి తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. కార్పొరేషన్ వేస్ట్ వాటర్ పైప్‌లైన్ వేసేందుకు రెండు భారీ పైప్‌లను తీసుకువచ్చిన గుత్తేదారుడు వాటిని రోడ్డుకు అడ్డంగా పెట్టి ఎటువంటి హెచ్చరిక బోర్డు పెట్టుకుండా వదిలేశాడు. పైప్‌లు రెండు నలుపురంగులో ఉండడం వల్లన బైక్‌పై వచ్చిన రూపస్‌కు కనిపించలేదు. దీంతో వాటిని ఢీకొట్టి మృత్యువాతపడ్డాడు. సమాచారం అందుకున్న మృతుడి బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని ధర్నా చేశారు. కార్పొరేషన్ గుత్తేదారుడి నిర్లక్ష్యం కారణంగానే రూపస్ మృతి చెందాడని.. న్యాయం చేయాలని డిమాం డ్ చేశారు. సంఘటనా స్థలాన్ని వన్‌టౌన్ సీఐ మురళీకృష్ణ పరిశీలించి మృతదేహాన్ని పో స్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశా మని వన్‌టౌన్ సీఐ పేర్కొన్నారు. సీసీ కెమెరా ఫుటేజీ తదితర అంశాలు పరిశీలిస్తున్నా మన్నారు.ఎవరిదైనా నిర్లక్ష్యం ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశించారని చెప్పారు.



అమ్మా..బాగున్నారా!

ఎలా ఉన్నారమ్మా! అంతా బాగానే ఉందా.. ఏమైనా లోటుపాట్లు ఉన్నాయా అంటూ జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మీ శనివారం గౌతమి జీవ కారుణ్య సంఘ ఆవరణలోని వృద్ధాశ్రమంలో వృద్ధులను ప్రశ్నించారు. ఆశ్రమంలో శని వారం ఆమె పర్యటించి వసతులు, సదుపాయాలు, ఆహారం తదితర అంశాలపై ఆరా తీశారు. వృద్ధులతో మాట్లాడి యోగక్షేమాల గురించి తెలుసుకున్నారు. వేళకు భోజనం చేయాలని, మందులు వేసుకోవాలని సూచిం చారు. ఏదైనా ఇబ్బంది ఉంటే తమ దృష్టికి తీసుకురా వాలని సూచించారు. వృద్ధుల పట్ల బాధ్యత, ఆప్యా యత తో నడుచుకోవాలని వృద్ధాశ్రమ సిబ్బందిని ఆదేశించారు. - రాజమహేంద్రవరం



ఇంకుడు గుంతలు నిర్మించండి : కలెక్టర్

గోకవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. పరిశుభ్రతను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గోకవరం మండలం అచ్చుతాపురంలో ఇంకుడు గుంతల నిర్మాణ పనులను శనివారం ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణానికి ఒక్కో దానికి రూ.6 వేలు చెల్లించడం జరుగుతుందన్నారు. ఇంకుడు గుంతల నిర్మించుకోవడం ద్వారా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడుతుందన్నారు. మండలానికి మంజూరైన 729 ఇంకుడు గుంతల నిర్మాణాలను పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోవిందు,తహ శీల్దార్ సాయిప్రసాద్,డ్వామా పీడీ ఎ.నాగ మహేశ్వరరావు,ఏపీవో అప్పలరాజు పాల్గొన్నారు.

వైద్యులు పనితీరుపై నిఘా : రమేష్‌కిశోర్
రాజమండ్రి ట్రాఫిక్ డీఎస్పీపై చర్యలు
8

వైద్యుల పనితీరుపై నిఘా

● డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ రమేష్‌కిశోర్



కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న దృశ్యం

కొవ్వూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించడానికి వైద్యుల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ డా. టి.రమేష్‌కిశోర్ అన్నారు. కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి, డీహెచ్‌ఎస్ కార్యాలయాన్ని శనివారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలను అడిగితెలుసుకుని మాట్లాడారు. ఇటీవల ప్రజల్లో సదరం సర్టిఫికెట్లు తొలగిస్తున్నామని అపోహలు ఉన్నాయన్నారు. దీని వల్ల అర్హులకు ఇబ్బంది ఉండదన్నారు. ఫేక్ సర్టిఫికెట్లు పెట్టిన వారిని ఏరివేయడం జరుగుతుందన్నారు. మరోవారంలో సర్వే పూర్తవుతుందన్నారు. తాడేపల్లిలోని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్ ద్వారా డాక్టర్ల పనితీరును పరిశీలించడం జరుగుతుందన్నారు. రాత్రి డ్యూటీల్లో డాక్టర్లపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. దీనిలో భాగం గా గత నెల రోజుల్లో 50 మంది వైద్యులకు పనితీరు మార్చుకోవాలని షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. ఫిబ్రవరి మొదటి వారం నుంచి ఓపీ కౌం టర్లు, ఆపరేషన్ థియేటర్లు, పేషెంట్లు ఉండే వార్డుల్లో క్యూఆర్ కోడ్ పెట్టామన్నారు.ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే 6 ప్రశ్నలు వస్తాయి. వీటిద్వారా ఆసుపత్రిలో వైద్యుల పనితీరు, మందుల కొరత, లాబ్ టెస్టులు, నర్సుల ప్రవర్తన తదితర వివరాలు రోగుల నుంచి తెలుసుకోవడం జరుగుతుందన్నారు. స్పెషలిస్టు డాక్టర్ల రిక్రూట్‌మెంటు జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 297 డాక్టర్ పోస్టులకు 2600 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఉండడంతో ఆలస్యమైందన్నారు. మార్చి నెలాఖరు నాటికి స్పెషలిస్టు డాక్టర్ల భర్తీ జరుగుతుందన్నారు. పదోన్నతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతిరోజు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు సంబంధించిన అబా ఐడి క్రియెట్ చేస్తే కేంద్ర ప్రభుత్వం ప్రతి పేషెంటుకు రూ.20లు ఆసుపత్రి ఖాతాకు జమ చేస్తుందన్నారు. గత రెండునెలలుగా పేషెంటు ఈహెచ్‌ఆర్‌లు స్కాన్ చేసి అబా ఐడి క్రియేట్ చేయడంలో తుని ఆసుపత్రికి సుమారు రూ.2 లక్షల వరకు సొమ్ము జమైందన్నారు. అబా ఐడి క్రియేట్ చేయడానికి స్థానికంగా ఇద్దరు వ్యక్తులను రూ.8 వేలు గౌరవ వేతనం ఇచ్చి ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. ఇలా వచ్చిన సొమ్ముతో ఆసుపత్రికి అవసరమైన వస్తువులు కొనుగోలు చేసుకోవచ్చునన్నారు. 26 జిల్లాల డీసీహెచ్‌ఎస్‌లకు హైర్ వాహనాలు తీసుకోవడానికి అనుమతులివ్వడం జరిగిందన్నారు. పారిశుధ్యం, సెక్యూరిటీలకు సంబంధించి సమస్య పరిష్కారానికి న్యూ టెండర్లకు వెళ్లడం జరిగిందన్నారు. అత్యవసర మందుల కొరత ఉంటే గుర్తించి ఆరోగ్యశ్రీ నిధులు, హెడీఎస్‌లో నిధులు ఉపయోగించి ఆసుపత్రి సూపరింటెండెంట్లు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డా. ఎన్.పద్మశ్రీరాణి, ఏడి టి.విజయలక్ష్మి, ఆసుపత్రి సూపరింటెండెంటు డా. కె.సాయికిరణ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



చిక్కాలలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, తదితరులు

చాగల్లు, ఫిబ్రవరి 15, (ఆంధ్రజ్యోతి): చిక్కాల చెరువు గట్టున నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. బుధవారం స్వామివారి మూలవిరాట్ ఊరేగింపుతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈసందర్భంగా గోపూజ, గణపతి పూజ, మండపార్చన, మూలమంత్ర జపం, శ్రీలక్ష్మీ గణపతి హోమం, అవాహిత హోమం, వేద విద్యార్థులచే వేదపఠనం, తదితర పూజలు గావించారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కూటమి నాయకులు నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, వై. అబ్బులు చౌదరి, చిటికెన పెంటారావు, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలి

● సమావేశంలో డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ రత్నప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న రత్నప్రసాద్

కొవ్వూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని డీఎల్ ఎస్‌ఏ సెక్రటరీ కె. రత్నప్రసాద్ సూచించారు. కొవ్వూరు 9వ అదనపు జిల్లా కోర్టులో వచ్చేనెల 8వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై శనివారం పోలీసులు, న్యాయవాదులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ ఎక్కువ కేసులు రాజీ మార్గంలో పరిష్కరించుకునేలా పోలీసులు, న్యాయవాదులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జీ. సాయికృష్ణ, 2వ అదనపు జూనియర్ మెజిస్ట్రేట్ కే. నాగలక్ష్మి, సీఐలు, ఎస్ఐలు, కోర్టు కానిస్టేబుళ్లు, ఎక్సైజ్ పోలీసులు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ఎస్.సత్యనారాయణ

దేవరపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయడానికి అధికారులు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎస్.సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం హౌసింగ్ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేసే దిశగా అవగాహన కల్పించాలన్నారు. మండలానికి 2,900 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 370 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని, ఇంకా 190 ఇళ్లు నిర్మాణదశలో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ధర్మారావు, పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ సిబ్బది, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం/పెరవలి: లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి అనిల్‌వినయ్ పేర్కొన్నారు. పెరవలి మండలం తీపర్రులో శనివారం లబ్ధిదారులతో జరిగిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, హౌసింగ్ ఏఈ ఎం. విక్టర్ బాబు, పీఆర్ఏఈ శ్రీమన్నారాయణ, డ్వాక్రా ఏపీఎం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో లారీ డ్రైవర్ మృతి

మృతుడు పంగిడి వాసిగా గుర్తింపు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ

మండపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడి పంచాయతీ పరిధిలో గల వేములపల్లిలో విద్యుదాఘాతానికిగురై లారీ డ్రైవర్ శనివారం మృతి చెందాడు. మండపేట రూరల్ సీఐ పీతల దొర్రాజు తెలిపిన వివరాల ప్రకారం .... తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం పంగిడికి చెందిన చిటికెన రామకృష్ణ లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడు వేముల పల్లిలో వున్న బ్రాన్ ఆయిల్ ఫ్యాక్టరీలో ఆయిల్‌లోడ్‌ను తీసుకువెళ్లేందుకు వచ్చి శనివారం ట్యాం కర్‌ను ఫ్యాక్టరీ బయట ఉంచి లారీ ట్యాంకర్‌ను శుభ్రం చేసుకునేందుకు లారీపైకి ఎక్కగా, అయనకు సమీపంలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో షాక్‌కు గురై కింద పడిపోయి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమా రుడు, కుమార్తె ఉన్నారు. మండపేట రూరల్ సీఐ దొర్రాజు, ఎస్ఐ బుజ్జిబాబు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. దీనిపై మృతుడి కుమారుడు చిటికెన శ్రీరామచంద్రుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు చెప్పారు.

షిర్డీ సాయినాథ్ ఆలయంలో పూజలు

చాగల్లు, ఫిబ్రవరి 15, (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయం పక్కన గల షిర్డీ సాయినాథ్ ఆలయంలో శనివారం 23వ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. దీనిలో భాగంగా విఘ్నేశ్వర పూజ, కలశ స్థాపన, బాబా గారి అర్చన, స్వామి వారికి అభి షేకం, తదితర పూజలు నిర్వహించారు. అనంతరం సాయి భక్తులచే సామూహిక విష్ణుసహస్ర పారాయణం చేయించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉసులుమర్రులో దాస ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఉండ్రాజవరం/పెరవలి, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): పెరవలి మండలం ఉసులుమర్రులో శనివారం దాస ఆంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, భక్తులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌లో మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్
● పలు ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహణ



23వ వార్డులో మహిళలకు హోం కంపోస్టుపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ నాగేంద్రకుమార్

కొవ్వూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని, ఇది అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ టీ. నాగేంద్రకుమార్ అన్నారు. శనివారం కొవ్వూరు పురపాలక సంఘం పరిధిలోని 19, 23వ వార్డులలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలతో కమిషనర్ స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదన్నారు. కార్యక్రమంలో మేనేజర్ పి. సాయిబాబు, మున్సిపల్ ఆర్ఐ కె. శ్యాం, రవి, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య మేస్త్రీలు, సిబ్బంది, వాడ్రేవు జోగమ్మ వేద సంస్కృత కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలోనూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే. సాయికిరణ్ ఆసుపత్రి సిబ్బందితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వైద్య, పారిశుధ్య సిబ్బందికి స్వచ్ఛతాహీ సేవపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

● **ఏబీఎన్ కళాశాలలో ...**

పట్టణంలోని అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగారావు డిగ్రీ కళాశాలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. రామమోహన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. వై. రమేష్, కళాశాల పీజీ డైరెక్టర్ చలపతిరావు, దయాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిడదవోలు: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ తేజశ్రీ అన్నారు. శనివారం పట్టణంలోని నెహ్రూనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్ర మంలో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ తేజశ్రీ మాట్లాడుతూ శానిటేషన్ సిబ్బంది ఇంటింటికీ వచ్చే సమయంలో తడి, పొడి చెత్తలను వేరు చేసి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో దిద్దే దయామణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపూడి: అన్నదేవరపేటలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా 3వ శనివారం ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని చెత్త సంపద తయారీ కేంద్రం వద్ద జంగిల్ క్లియరెన్స్ చేసి మొక్కలు నాటారు. అనంతరం పాఠశాల విద్యార్థులు, గ్రామస్థులతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూరజన్, ఏపీవో రమాదేవి, సీహెచ్ రామా రావు, రవిప్రకాష్ సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం/పెరవలి: ఉండ్రాజవరం మండలంలోని పలు గ్రామాల్లో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఎంపీడీవో వీఎస్ రామారావు, ఈవోపీఆర్డీ కెఎస్ఆర్ శర్మ, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అలాగే పెరవలి మండలంలో జరిగిన కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సునిల్ వినయ్, ఎంపీడీవో వెంకటరమణ, ఇతర అధికారులు, నేతలు పాల్గొన్నారు.

దేవరపల్లి: స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అన్ని పంచాయతీ ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాల్లో శనివారం పారిశుధ్య నివారణ చేపట్టినట్టు ఎంపీపీ కేవీకే దుర్గారావు తెలిపారు. దీనిలో భాగంగా ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రను నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రాజారావు, మండల పరిషత్ సూపరింటెండెంట్ శాంతి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామ సచివాలయాలు, చెత్త సంపద కేంద్రాల వద్ద పరిసరాలను పంచాయతీ కార్యదర్శి ఎన్. రవికిషోర్ ఆధ్వర్యంలో శుభ్రం చేయించారు. పంచాయతీ సిబ్బంది ఎన్. శ్రీనివాస్, విక్టర్‌పాల్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలులో ప్రతిజ్ఞ చేస్తున్న ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది



తాళ్లపూడి : స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌లో విద్యార్థులు, గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపే లక్ష్యం : మంత్రి



సమిశ్రగూడెంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలలో యువత తమ తొలి ప్రాధాన్యత ఓటు కూటమి అభ్యర్థికి వేసి పేరాబత్తుల రాజశేఖరాన్ని గెలిపించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం సమిశ్రగూడెం విజ్ఞాన్ వికాస్ కళాశాల ఆవరణలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజశేఖరంను గెలిపిస్తే యువతకు గొంతుకై వారి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా మండలిలో కృషి చేస్తారన్నారు. ఈ నెల 27వ తేదీన జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలలో రాజశేఖరానికి ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు బూర్లగడ్డ వేదవ్యాస్, తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: ఉభయ గోదావరి జిల్లాల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు ఓటు వేసి గెలిపించాలని టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ కోరారు. ఆయన ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు శనివారం ముమ్మరంగా ప్రచారాన్ని నిర్వహించాయి. దీనిలో భాగంగా అనంతపల్లి, నల్లజర్ల, పోతవరం, దూబచర్ల హైస్కూల్‌లో ఉపాధ్యాయులను కలిసి కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో షేక్‌మీరా సాహెబ్, మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, గుదె సుబ్బారావు, చోడసాని బాపిరాజు పాల్గొన్నారు.

చాగల్లు: కూటమి బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని కొవ్వూరు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు కే.బాలాజీ, గొర్రెల శ్రీధర్ కోరారు. శనివారం చాగల్లు, బ్రాహ్మణగూడెం, ఊనగట్లలో ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందిని కలిసి ఓట్లను అభ్యర్థించారు. మండల పార్టీ అధ్యక్షుడు నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, నియోజవర్గ నాయకులు మద్దిపట్ల సురేష్, బొల్లిన శివనాగేంద్ర, పత్తిపాటి సుబ్బారావు, దొంగ రామకృష్ణ, తాళ్లూరి హరిశ్చంద్రప్రసాద్, తాళ్లూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగిసిన పోషణ్ బీ పడాయి బీ శిక్షణ తరగతులు



కొవ్వూరులో అంగన్‌వాడీలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ పద్మావతి

కొవ్వూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : డిజబులిటీ ఉన్న పిల్లలను గుర్తించి, వారు అందరితో కలిసి ఉండేలా కృషిచేయాలని కొవ్వూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి డీ. మమ్మీ తెలిపారు. కొవ్వూరు సంస్కృత పాఠశాల ప్రాంగణంలో మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ పడాయి బీ కార్యక్రమంలో భాగంగా మూడో రోజు శిక్షణ శనివారంతో ముగిసింది. దీనిలో భాగంగా పాఠశాల క్రీడా మైదానంలో అంగన్వాడీ కార్యకర్తలు మానవహారంగా ఏర్పడి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కేవీ పద్మిని, జీ. ఆదిలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: వేగేశ్వరపురం ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడురోజులుగా ఇస్తున్న పోషణ్ బీ పడాయి బీ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ మేరకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భానుమతి, భాగ్యకుమారి తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లజర్ల: చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని సీడీపీవో నాగలక్ష్మి అన్నారు. పోషణ బీ పడాయిబీపై అంగన్‌వాడీలకు నల్లజర్ల, పోతవరం హైస్కూల్‌లో ఇస్తున్న శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. కార్యక్రమంలో ఏసీడీపీవో పద్మావతి, సూపర్‌వైజర్ వెంకట లక్ష్మి, హారతి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: నవ చేతన చిన్నారులు (0 నుండి 6 సంవత్సరాలు) శారీరక మానసిక అభివృద్ధి పెంపొందించే విధంగా కార్యక్రమాలు జరగాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పీ. పద్మావతి, జీ. శిరీషా అన్నారు. మూడు రోజుల పాటు జరిగిన పోషణ్ బీ, పడాయి బీ శిక్షణ శనివారంతో ముగిసింది. కార్యక్రమంలో చాగల్లు, మార్కొండపాడు సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం



నిడదవోలులో మజ్జిగ పంపిణీ చేస్తున్న డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి

నిడదవోలు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు కరాటే అసోసియేషన్ మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని జనసేన నాయకుడు డాక్టర్ తోపరాల కల్యాణ్ చక్రవర్తి అన్నారు. శనివారం నిడదవోలు పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలోని కరాటే అసోసియేషన్ కార్యాలయం వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కరాటే చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ జీవీ రమణ, కే.అనిల్, ఎస్‌కే బాషా, జీఎన్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ డీఎస్పీపై చర్యలు

● చీఫ్ ఆఫీస్‌లో రిపోర్టుకి ఉత్తర్వులు



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్ర జ్యోతి): ట్రాఫిక్ డీఎస్పీ మేడిశెట్టి వెంకటేశ్వ ర్లుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకు న్నారు. రాజమహేంద్రవరం వచ్చిన నాటి నుంచీ ఆరోపణలు మూట గట్టుకున్న ఆయ నకు జిల్లానుంచి ఉద్వాసన పలికారు. గతే డాది డిసెంబరు 24న దేవీచౌక్‌లోని స్వాతీ టీస్టాల్‌లో పని చేస్తున్న యువకుడిని ఆయన కొట్టుకుంటూ జీపులో ఎక్కించుకెళ్లారు. దీనికి సంబంధించిన సీసీ కెమెరా పుటేజీలు ఇటీవల బయటికి వచ్చాయి. సోషల్ మీడి యాలో వైరల్ అయ్యాయి. ఒక వ్యక్తిపై పోలీసు దాష్టీ కాన్ని జనం ఖండించారు. ఈ విషయం ఎస్పీ నరసింహకిషోర్ దృష్టికి చేరింది. అమానవీయ ప్రవర్తనపై ఉక్కుపాదం మోపే ఎస్పీ.. సదరు డీఎస్పీపై అంతర్గత విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. దీంతో ఆయనను తక్షణమే ఇక్కడి విధుల నుంచి తప్పిస్తూ డీజీపీ కార్యాలయంలోని ఏడీజీపీ(శాంతి భద్రతలు) వద్ద రిపోర్టు చేయాల్సిందిగా రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి శనివారం ఆదేశాలు వెలువడ్డాయి. ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఆయనను వెంటనే రిలీవ్ చేయాల్సిందిగా ఎస్పీని ఆ ఉత్తర్వుల్లో ఆదేశిం చారు. కాగా.. కొద్దిరోజుల క్రితం డీఎస్పీ వెం కటేశ్వర్లు గుణదల ఉత్సవాలకు బందోబస్తుకు వెళ్లారు. ఆయనపై చర్యలు తప్పవనే ఉద్దేశంతో అక్కడి విధుల అనంతరం విజయవాడలో బందోబస్తుకు పంపించేశారని అంటున్నారు. గతంలో ఆ డీఎస్పీ ఓ మహిళా కానిస్టేబుల్‌ని లైంగికంగా వేధించడంపై అప్పట్లోనే ఎస్పీ సీరియస్ అయ్యారు. ఆ ఘ టనలో ఇంకెప్పుడూ ఆమె జోలికి వెళ్లనంటూ డీఎస్పీ వెంకటేశ్వర్లు స్టాంపుపేపర్‌పై రాసి చ్చారు. ఇది పోలీసు అధికారులకు తప్పుడు మెస్సేజ్ పంపిస్తుందంటూ విమర్శలు వెల్లువె త్తాయి. అప్పట్లోనే ఆ డీఎస్పీపై సస్పెన్షన్ వేటు పడాల్సి ఉండగా 'మేనేజ్' చేసుకున్నారనే విమర్శలు వినిపించాయి. అప్పటి నుంచీ ఆయనను స్థానిక విధులకు దూరం పెడుతూ వచ్చారు. తర్వాత తన వద్ద పని చేసే హోంగార్డును ఇష్టానుసారం తిట్టడంతో అతడు ఆత్మహత్య చేసుకుంటానంటూ ఆవేదన చెందారు. ఇలా తరచూ డీఎస్పీపై ఆరోపణలు వస్తుండడంతో కీలకమైన విధులకు దూరంగా ఉంచారు. అయితే, ఓ సాధారణ యువకుడిని పబ్లిక్‌లో కొట్టుకుంటూ తీసు కెళ్లడంతో ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేశారని తెలుస్తోంది. ఆయన సిఫా రసుతో ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. కాగా నాణేనికి మరోవైపు ఇంకొక విధంగా గుసగుసలు వినవస్తున్నాయి. రాజమహేంద్రవరం డీఎస్పీగా రావడానికి అంబికా ప్రసాద్ ప్రయత్నిస్తున్నారని, ఆయన సొంత బంధువైన ఓ హెడ్ కానిస్టేబుల్‌తో డీఎస్పీ వెంకటేశ్వర్లు సీసీ కెమె రా ఫుటేజీ తీయించి సోషల్ మీడియాలో వైరల్ చేయించారనే ఆరోపణలు ఉన్నాయి. అంబికా ప్రసాద్ వైసీపీ వీర విధేయుడిగా పేరుబడ డంతో కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఆయన వీఆర్‌లోనే ఉన్నారు. ఈ అంతర్గత రాజకీయాలవల్ల ప్రజలకు రక్షణ కల్పిం చాల్సిన విధుల్లో ఉండి యూనిఫాం పరువు బజారుకు ఈడుస్తున్నారంటూ ప్రజలు మండిపడుతున్నారు.

కానిస్టేబుల్‌ను గాయపర్చిన ఘటనలో ఏడుగురిపై కేసు

కొవ్వూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : దొంగతనాలకు పాల్పడి పారిపోతూ కానిస్టేబుల్‌ను స్కార్పియోతో ఢీకొట్టి గాయపర్చిన ఏడు గురిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఎస్ఐ కే. జగన్మోహనరావు తెలిపారు. దీని వివరాలివి... యర్రవరంలో దొంగతనం చేసి స్కార్పియోలో విజయవాడ వైపు వారు పారిపోతున్నారనే సమాచారం రావడంతో పోలీసులు కొవ్వూరు గామన్ బ్రిడ్జి టోల్‌ప్లాజా సమీపంలో తనిఖీ చేపట్టారు. ఎన్‌హెచ్ -16లో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ బీ. రాంబాబు, హెచ్‌సీ ఎం.లక్ష్మీనారాయణకు సమాచారం అందింది. దీంతో టోల్‌గేట్ వద్ద వాహ నాలు తనిఖీచేశారు. వాహనాన్ని ఆపడానికి ప్రయత్నించగా రాంబాబును ఒక్కసారిగా ఢీకొట్టడంతో కిందపడిపోయాడు. గాయాలు కావడంతో పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

కొవ్వూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి. విశ్వం తెలిపారు. కొవ్వూరు గామన్‌బ్రిడ్జి టోల్‌ప్లాజా సమీపంలో సుమారు 55 నుంచి 60 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొంది. అతని ఒంటిపై లైట్ నీలం రంగు చొక్కా, కుడి చేతి వేలుకి ఏసుప్రభు బొమ్మ, ఉంగరం ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి సంబంధించి ఆచూకీ తెలిసినవారు కొవ్వూరు పట్టణ పోలీస్టేషన్ 9440796622, 08813-231100, 9154875583 నెంబర్లకు సమాచారం అందివ్వాలని సీఐ సూచించారు.